

పింఛన్ తిప్పలు..

మూడు బస్సులు మారితేనే డబ్బులు తీసుకునేది..!



- బొక్కలగుట్ట, పులిమడుగు గ్రామస్థుల అవస్థలు
- రెండు గ్రామాల్లో సుమారు 600 మంది లబ్ధిదారులు
- పొరుగు గ్రామంలోని పోస్టాఫీస్‌కు వెళ్లక తప్పని పరిస్థితులు
- బాధితుల విజ్ఞప్తులను పెడచెవిన పెడుతున్న అధికారులు
- గ్రీవెన్స్‌సెల్‌లో కలెక్టర్‌కు గ్రామస్థుల ఫిర్యాదు

ప్రతినెలా ఇవ్వాలి...



పింఛన్ల కోసం ప్రతినెలా తిమ్మాపూర్‌కు వెళ్లిరావడం ఇబ్బందిగా మారింది. కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే ఇవ్వాళ గ్రామంలోనే డబ్బులు ఇచ్చారు. అలాగే ప్రతినెలా మా గ్రామంలోనే పింఛన్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి.

- ఆవిడపు రాజయ్య, బొక్కలగుట్ట

నానా ఇబ్బందులు పడుతున్నాం...



పింఛన్ల కోసం పొరుగు గ్రామానికి వెళ్లడంతో నానా ఇబ్బందులు పడుతున్నాం. బస్సులు సమయానికి దొర క్క రోజంతా కష్టపడాల్సి వస్తోంది. ఇతర ఊర్ల మాది రిగానే మా పింఛన్లను మా గ్రామంలోనే ఇస్తే ఇబ్బం దులు తప్పుతాయి.

- గుండా భీమక్క

మంచిర్యాల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వారంతా వయో వృద్ధులు, భర్తలేని ఒంటరి మహిళలు, అంగ వైకల్యం కలవారు. ప్రభుత్వాలు అందించే నెలవారీ పింఛన్లపైనే ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. ఆయా వర్గాల ప్రజల కష్టాలు తీర్చేందుకు ప్రభుత్వం క్రమం తప్పకుండా పింఛన్ సొమ్మును విడుదల చేస్తున్నప్పటికీ....నగదును స్వీకరించేందుకు వారంతా అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. తమ గ్రామాలను కాదని, ఎక్కడో ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న మరో గ్రామ పంచాయతీలో పింఛన్ సొమ్ము ఇస్తుండటంతో విధిలేని పరిస్థితుల్లో అంతదూరం ప్రయాణం చేయక తప్పడం లేదనే ఆవేదనను బాధితులు వ్యక్తం చేస్తున్నారు. పింఛన్లకోసం అధిక వ్యయ, ప్రయాసలకు ఓర్చుకోవలసి వస్తోందని, ఇతర లబ్ధిదారుల వలే తమకు కూడా గ్రామంలోనే నగదు ఇచ్చే ఏర్పాట్లు చేయాలన్న విజ్ఞప్తులను సంబంధిత అధికారులు పెడ చెవిన పెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

పొరుగు గ్రామంలోని పోస్టాఫీస్‌కు వెళ్లాల్సిందే...

జిల్లాలోని మందమర్రి మండలం బొక్కలగుట్ట, పులిమడుగు గ్రామ పంచాయతీల్లో సుమారు 600 మంది వరకు పింఛన్లు అందుకునే లబ్దిదారులు ఉన్నారు. వీరిలో వికలాంగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులు ఉన్నారు. వారందరికీ ప్రభుత్వం క్రమం తప్పకుండా నెలవారీ పింఛన్లు పంపిణీ చేస్తోంది. మండలంలో మొత్తం పది గ్రామ పంచాయతీలు ఉండగా, పై రెండు మినహా మిగతా వాటిలో లబ్దిదారులకు అక్కడికక్కడే అధికారులు పింఛన్లు ఇచ్చే ఏర్పాట్లు చేశారు. కేవలం బొక్కలగుట్ట, పులిమడుగు గ్రామాల లబ్దిదారులకు మాత్రం ఆ వెసులుబాటు లేక మండలంలోని దాదాపు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న తిమ్మాపూర్‌లోగల పోస్టాఫీస్‌కు వెళ్లాల్సి వస్తోంది. రవాణా సౌకర్యం సక్రమంగా లేకపోవడంతో రాకపోకలకు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోందని లబ్దిదారులు వాపోతున్నారు. మండలంలోని మిగతా ఎనిమిది గ్రామాల మాదిరిగా తమకు కూడా స్వగ్రామంలోనే పింఛన్లు అందజేస్తే అధిక వ్యయ, ప్రయాసలు తప్పుతాయని, ఈ విషయమై పలు మార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా ఫలితం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

లబ్ధిదారులకు ఇక్కట్లు..

పింఛన్లకోసం లబ్దిదారులు నేరుగా పోస్టాఫీస్‌కు వెళ్లాల్సి ఉంటుంది. బొక్కలగుట్టకు చెందిన లబ్దిదారులు బస్సులో పులిమడుగు గ్రామం వరకు ప్రయాణించి, దిగిన తరువాత నేషనల్ హైవే 363 అవతలి వైపునకు అండర్ పాస్ ద్వారా వెళ్లి కోటేశ్వర్ పల్లె స్టేజీ వద్దకు చేరుకోవాలి. అక్కడ మరో బస్సు ఎక్కి తిమ్మాపూర్ ఎక్స్ రోడ్డు వద్ద దిగాలి. అక్కడి నుంచి గ్రామంలోని పోస్టాఫీస్ వరకు..

(తరువాయి 7లో)

కాళేశ్వరం ప్రాజెక్టుతో నష్టపోతున్న రైతులు



అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడుతున్న మంత్రి వివేక్‌వెంకటస్వామి

మందమర్రిటౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కాళేశ్వరం ప్రాజె క్టుతో చెన్నూరు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని రాష్ట్ర గనులు, కార్మిక, ఉపాధి కల్పనశాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి పేర్కొన్నారు. సోమవారం అసెంబ్లీ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ 80వేల పుస్తకాలు చదివి ఎలాంటి ప్రాజెక్టుకట్టారో ప్రజలకు అర్థమైందన్నారు. ఈ ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో పంటలన్నీ నష్టపోతున్నాయని, ఎక్కువగా నష్టపోతుంది తన నియోజకవర్గం రైతులేనని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టును ఆ పార్టీ ఎమ్మెల్యేలు సమర్థించడం సరైంది కాదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కుంభకోణాలకు నిలయంగా మారిందని, ఈ ప్రాజెక్టు కేసీఆర్ కుటుంబం మాత్రమే బాగు పడదన్నారు. దీని విషయం సీబీఐకి అప్పగించడం మంచి పరిణామమన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ



కాంస్య పతకం సాధించిన అఖిల్

లక్సెట్టిపేట, సెప్టెంబర్, 1(ఆంధ్రజ్యోతి): లక్సెట్టిపేట పట్టణంలోని మహాత్మ జ్యోతి బాపూలే పాఠశాలకు చెందిన పి.అఖిల్ అనే విద్యార్థి అథ్లెటిక్స్ రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల ప్రిన్సిపల్ మంగ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 30,31తేదీల్లో మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన 11వ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అఖిల్ పాల్గొని కాంస్య పతకం సాధించినట్లు తెలిపారు.

గణేశ్ నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించాలి

- మంచిర్యాల డీసీపీ భాస్కర్



డీసీపీ భాస్కర్‌ను సన్మానిస్తున్న మండపం నిర్వాహకులు

మందమర్రిటౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గణపతి నవ రాత్రి ఉత్సవాలను దృష్టిలో ఉంచుకుని పెద్ద ఎత్తున పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామని డీసీపీ భాస్కర్ తెలిపారు. సోమవారం పట్టణం లోని యాపల్ ఏరియా శ్రీ సిద్ధివినాయక మండపాన్ని ఆయన సందర్శించారు. వినాయకునికి పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ గణనాధుల నిమజ్జన వేడుకలను ప్రశాంతంగా శాంతియుతంగా నిర్వహించాలన్నారు. పోలీసుల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. అనంతరం మండపం నిర్వహకులు ఘనంగా సన్మానించారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు రివిలేషన్ విద్యార్థి ఎంపిక



శశివర్దన్‌ను అభినందిస్తున్న చైర్మన్ విష్ణువర్ధన్‌రావు

మంచిర్యాల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి యోగా పోటీలకు జిల్లా కేంద్రంలోని రివిలేషన్ హై స్కూల్ విద్యార్థి నాగుల శశి వర్దన్ ఎంపిక య్యాడు. ఇటీవల జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన శశివర్దన్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు రివిలేషన్ విద్యా సంస్థల చైర్మన్ రాపోలు విష్ణువర్దన్‌రావు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని చైర్మన్ విష్ణువ ర్ధన్‌రావు, ప్రిన్సిపాల్ ప్రశాంత్ సోమవారం శాలువాతో సత్కరించి, అభినందించారు. ఈ కార్యక్రమంలో కోచ్ అరుణ్, విద్యార్థి తండ్రి నాగుల శ్రీనివాస్, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మంచిర్యాలక్రైం, సెప్టెంబర్1 (ఆంధ్ర జ్యోతి): నస్పూర్ మున్సిపాలిటి పరిధిలో పని చేసిన పారిశుధ్య కార్మికుల పీఎఫ్, ఈఎస్ఐ కట్ చేసిన నగదును కార్మికుల అకౌంట్‌లోకి జమ చేయాలని కాంట్రాక్టు కార్మికుల సంఘం నాయకులు కమిషనర్ సంపత్‌కు వినతిపత్రం అందజేశారు. గౌరవ అధ్యక్షులు హరిక్రిష్ణ మాట్లాడుతూ నస్పూర్ పరిధిలో పని చేస్తున్న 132 మంది పారిశుధ్య కార్మికులకు కొన్ని సంవత్సరాలుగా పీఎఫ్, ఈఎస్ఐ జీతం నుంచి కట్ చేశామని కట్ అయిన మొత్తాన్ని తమ అకౌంట్‌కు బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావుకు విన్న వించామని తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాలక్రైం,సెప్టెంబరు 1 (ఆంధ్ర జ్యోతి): అంబేద్కర్ ఓపెన్‌డిగ్రీ అడ్మిషన్లు ఈనెల 12వరకు దరఖాస్తు చేసుకోవాలని అంబేద్కర్ ఓపెన్ యూ నివర్సిటి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జైకిషన్ ఓఝా, అంబేద్కర్ స్టడి సెంటర్ కోఆర్డినే టర్ నరేందర్‌రెడ్డి సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఇంటర్, ఐటీఐ, ఓపెన్ ఇంటర్, పాలిటెక్నిక్, వొకేష నల్ కోర్సులు పూర్తి చేసిన వారు ఓపెన్ డిగ్రీ చేసేందుకు అర్హులని తెలిపారు. బీఏ, బీకాం, బిఎస్సీ గ్రూపులో అవకాశం ఉందని తెలిపారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని అడ్మిషన్ ఫీజు చెల్లించని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకోసం 7382929719 లేదా 7780708 354 సంప్రదించాలని తెలిపారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- కలెక్టరేట్ ఎదుట బీజేపీ ధర్నా..



కలెక్టరేట్ ఎదుట నినాదాలు చేస్తున్న వెంకటేశ్వర్ గౌడ్, వెంకటేష్ నేత, రఘునాథ్‌లు

నస్పూర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలను పరిష్కరించడం, మౌలిక సదుపాయాల కల్పనలో, ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలం చెందిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ ఆరోపించారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం పాదయాత్రగా నస్పూర్‌లోని సోమవారం కలెక్టరేట్‌కు చేరుకుని ప్రధాన ద్వారం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ కుమార్ దీపక్‌కు అందించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ వెంకటేష్ నేత, జిల్లా మాజీ అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌లతో కలిసి జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ మాట్లాడారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు ముల్కల్ల మల్లారెడ్డి, ఏమాజీ, దుర్గం అశోక్, ఎనగందుల కృష్ణమూర్తి, ముఖేష్ గౌడ్, కమాలాకర్‌రావు, కుర్ర చక్రి, శ్రీదేవి పాల్గొన్నారు.

అలరించిన కళోత్సవ్ పోటీలు

మంచిర్యాలక్రైం, సెప్టెంబర్1 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన కళాఉత్సవ్ పోటీలు ఘనంగా ముగిసాయి. జిల్లాలోని వివిధ యాజమాన్యాల నుంచి సుమారు 440 మంది విద్యార్థులు 11 అంశాల్లో పాల్గొని తన ప్రతిభను చాటారు. జిల్లా స్థాయిలో గెలు పొందిన విద్యార్థులకు డీఈవో యాదయ్య బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధికారులు పాల్గొన్నారు.

ఐటీఐ విద్యార్థులకు అప్రెంటీస్‌షిప్, ప్లేస్‌మెంట్ అవకాశం అందించాలి

- ఐటీఐ ప్రిన్సిపాల్ రమేశ్

మంచిర్యాలక్రైం,సెప్టెంబర్ 01(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ఉపాధి మరియు శిక్షణ విభాగం ప్రభుత్వ ఐటీఐ విద్యార్థులకు అప్రెంటిషిప్, ప్లేస్‌మెంట్ అవకాశాలను అభ్యర్థులకు అందించాలని సింగరేణి సీఅండ్ఎండీ బల్‌రాం నాయక్‌కు వినతిపత్రాలు అందజేశారు.

ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రమేశ్ మాట్లాడుతూ మంచిర్యాల ప్రభుత్వ ఐటీఐలో శిక్షణ పొందిన వారికి అప్రెంటిషిప్ ఆన్‌ది జాబ్ శిక్షణ, ప్లేస్‌మెంట్ అవకాశాలను అందించాలన్నారు. సింగరేణి, ఎన్‌టీపీపీ సహకారంతో అనుభవాన్ని మెరుగుపరుచడమే కాకుండా పునరు త్పాదకత ఇంధన రంగంలో నైపుణ్యం కలిగిన సాంకేతిక నిపుణుల సమూహాన్ని నిర్మించడానికి దోహద పడుతుందని సంస్థ సహకారంతో అభ్యర్థులకు అవకాశం కల్పించాలని కోరారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కలెక్టరేట్ ఎదుట ధర్నా

నస్పూర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జన్నారం మండలంలోని సర్వే నంబరు 72, 73, 74లో మూడు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న భూమిని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం గ్రామీణ పేదల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ప్రధాన ద్వారం వద్ద నుంచి ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకుని ఆందోళనకు దిగారు. ఆ భూమిని కొందరు రాజకీయ పలుకుబడి కలిగిన వారు అక్రమించుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నరని, భూమిని కాపాడి పేదలకు ఇవ్వాలని కోరుతూ కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ పేదల సంఘం జిల్లా కార్యదర్శి దారంగుల ఎల్లయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటాద్రి, జిల్లా అధ్యక్షుడు ఎన్నం శంకర్, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అంబాల మహేందర్, నాయకులు నరసయ్య, కిషన్, సంధ్యారాణి, రాజమొగిలి, పురుషోత్తం పాల్గొన్నారు.

పార్టీకోసం కష్టపడిన వారికే స్థానిక ఎన్నికల్లో అవకాశం

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రహ్మత్ హుస్సేన్



సంబురాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నాయకులు

మంచిర్యాలక్రైం,సెప్టెంబర్1(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడిన వారికే స్థానిక ఎన్నికల్లో టిక్కెట్లు కేటాయిస్తామని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రహ్మత్ హుస్సేన్ అన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు కోసం ఏర్పాటు చేసిన సమావేశాన్ని కొక్కిరాల ప్రేంసాగర్ రావు నివాసం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం పాటుపడినవారికే స్థానిక ఎన్నికల్లో సీట్లు కేటాయిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకొని గెలుపే లక్ష్యంగా పని చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పట్టణ అధ్యక్షులు తూముల నరేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పూదరి తిరుపతి, తాజా మాజీ నాయకులు పాల్గొన్నారు.

దేశ ప్రగతే లక్ష్యంగా పనిచేయాలి

మందమర్రిటౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : దేశంలో అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలకు ఎంపికైన యువ ప్రజాప్రతినిధులందరు దేశ ప్రగతి, ప్రజా సంక్షేమే లక్ష్యంగా పనిచేయాల్సిన బాధ్యత ఉందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పేర్కొన్నారు. సోమవారం హైద్రాబాద్‌లోని యూసఫ్‌గూడలో ఎన్ఐఎంహెచ్ఎంఈ ప్రాంగణంలో నిర్వహించిన యంగ్ ఇండియన్‌పార్లమెంట్ వైఐటీ 2.0 కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఇలాంటి సమావేశాలు యువ ప్రతినిధులకు ఎంతగానో దోహదపడతాయన్నారు. విద్య ప్రతి ఒక్కరికి ముఖ్యమన్నారు.

దేశానికి ఏదో ఒకటి చేయాలనే ఆలోచనలతో ఆధునాతన కొత్త ఆవిష్కరణలు చేయాలన్నారు.

పలు రైళ్లు రద్దు

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉప్పల్- జమ్మి కుంట మధ్యలో మూడో రైల్వే ట్రాక్‌లైన్ పనుల కారణంగా పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్ నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్‌కు వెళ్లే ఇంటర్ సిటీ రైలు, సింగరేణి రైళ్లు ఈ నెల 2న నాగ్‌పూర్ ప్యాసింజర్ రైలును 3న రద్దు చేస్తున్నట్లు తెలిపారు.

కేసీఆర్ చిత్ర పటానికి క్షీరాభిషేకం

నస్పూర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్టణంలోని తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్ర పటానికి క్షీరాభిషేకం, అమరవీ రుల స్థూపం, తెలంగాణ తల్లి విగ్రహా నికి సోమవారం బీఆర్ఎస్‌వి నాయకులు ఆధ్వర్యంలో జలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంతి రేవంత్ రెడ్డి కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సమాజాన్ని అవమానపరిచారన్నారు. సబ్బండ వర్గాల మేలు కోసం ఎనలేని కృషి చేసారన్నారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగం బీఆర్ఎస్‌వి నియోజక వర్గం అధ్యక్షుడు దగ్గుల మధు, యువజన విభాగం నాయకులు కాటం రాజు, నరేందర్ రెడ్డి, కందుల ప్రశాంత్ వంశీ, ప్రవీణ్, హైమద్, బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి మెరుగు పవన్ కుమార్ పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యంపై నిషేధం

- అనుమతిలేని డీజేలు, డ్రోన్‌లపై అనుమతి లేదు
- సీపీ అంబర్‌కిషోర్‌ఝా

మంచిర్యాలక్రైం, సెప్టెంబర్1 (ఆంధ్రజ్యోతి): రామగుండం పోలీసు కమిషన రేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌లో మద్యంపై నిషేదాజ్ఞలు కొనసాగుతాయని, అనుమతిలేని డీజేలు, డ్రోన్లపై చర్యలు తీసుకుంటామని రామగుండం పోలీసు కమిషనరేట్ అంబర్‌కిషోర్‌ఝా అన్నారు. మద్యం సేవించి రోడ్లపై విచ్చలవిడిగా తిరుగుతూ అసభ్యంగా ప్రవర్తించడం నేరమన్నారు. నిబంధనలను అనుసరించి నిషేదాజ్ఞలు కొనసాగుతాయని, ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసు కుంటామన్నారు. డీజే సౌండ్‌ల వినియోగంపై అమలులో ఉన్న నిషేదాజ్ఞలు కొనసాగి స్తామన్నారు. డీజే సౌండ్‌లు వినియోగిం చేందుకు తప్పనిసరిగా అనుమతులు తీసు కోవాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని ఆయన కోరారు.

పోరాటాలకు కార్యకర్తలు సిద్ధం కావాలి

శ్రీరాంపూర్, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి) : పోరాటాలకు కార్యకర్తలు సిద్ధం కావాలని హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు తిప్పారపు సారయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు అనిల్ రెడ్డి, కార్యదర్శి పొనగంటి అశోక్ కోరారు. ఈ మేరకు ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఆగస్టు 30, 31 తేదీల్లో నిర్వహించిన యూనియన్ మహాసభల్లో పలు తీర్మాణాలు చేసినట్లు పేర్కొన్నారు. కార్మికుల పక్షాన నిలుస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఉద్యమ స్ఫూర్తితో పనిచేసి ఉద్యోగుల మనసు చూరగొనాలని కార్యకర్తలకు వారు విజ్ఞప్తి చేశారు. మహాసభల విజయవంతానికి కృషి చేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా దీపోత్సవం

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ఆదిత్య ఎన్‌క్లేవ్ కాలనీలో గణపతి మండపం వద్ద దీపోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. గణపతికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే చిన్న పిల్లల సంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, అశోక్, శ్యాంసుందర్, వెంకటేష్, మహిళలు శారద, విజయ, కవిత, శారద, సుజాత, గౌతమి, పద్మ, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట సీపీఎస్ విద్రోహ దినం

- ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకులు

నస్పూర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పాతపెన్షన్ సాధనకోసం టీజీఈ-జేఏసీ మంచిర్యాల జిల్లాలోని అన్ని మండలాల ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల నాయ కులు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశాయి. అంతకు ముందు జాతీయ రహదారి వద్ద కమాన్ నుంచి ఊరేగింపుగా చేతిలో ప్లకార్డులు పట్టుకు నినాదాలు చేస్తూ వచ్చారు. కలెక్టరేట్ ప్రధాన ద్వారం ఎదుట మానవహారంగా నిరసన వ్యక్తం చేస్తూ నినాదాలు చేశారు. సీపీఎస్ వద్దు, ఓపీఎస్ ముద్దు, సీపీఎస్ రద్దుచేయాలి, ఓపీఎస్ పునరుద్దరించాలి, సీపీఎస్ ఒక మోసం, ఓపీఎస్ ఒక భరోసా నినాదాలతో కూడిన ప్లకార్డులు పట్టుకుని ఉద్యోగులు మధ్యాహ్నాభోజన విరామసమయంలో నిరసనకు దిగారు. అనంతరం పలుడిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ కుమార్‌దీపక్‌కు అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సీపీఎస్ రద్దుచేసి ఓపీఎస్‌ను పునరుద్దరించాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో ఉద్యోగసంఘాల నాయ కులు శ్రీహరి, వనజారెడ్డి, వేణుగోపాల్, శంకర్‌గౌడ్, సాగర్, మల్లయ్య, సునిత, శ్రీపతి బాబూ రావు, రాజావేణు, కృష్ణ, రాకేష్‌శర్మ, విజయ భారతి, గంగారాం, తిరుపతిలతో పాటు జిల్లాలోని 18 మండలాలకు చెందిన ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సీపీఎస్‌ను వెంటనే రద్దు చేయాలి

బెల్లంపల్లి: లక్షలాది ఉద్యోగుల భద్రతను కుటుంబాల సంక్షేమాన్ని బలితీసుకున్న సీపీఎస్‌స్కీం విధానాన్ని ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని కోరుతూ సోమవారం మున్సిపల్ కార్యాలయం ముందు ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రభుత్వం కంట్రిబ్యూటరి పెన్షన్ స్కీం రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కళోత్సవ్ పోటీలు

కౌటాల, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో సోమవారం ఎంఈవో హనుమంతు ఆధ్వర్యంలో విద్యార్థులకు మండల స్థాయి కళోత్సవ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు బాలికలకు గ్రూప్ డ్యాన్స్, సోలో డ్యాన్స్, పాటలు, స్టోరీలు వంటి అంశాలలో పోటీలు నిర్వహించారు. గ్రూప్ డ్యాన్స్‌లో కేజీవీబీ పాఠశాలకు చెందిన శైలజ గ్రూప్ మొదటిస్థానం, పాటల గ్రూప్‌లో కేజీబీవీ పాఠశాలకు చెందిన అంజుర, శిరీష, స్టోరీ టెల్లింగ్‌లో కేజీబీవీ నుంచి రాజేశ్వరిలు విజేతలుగా నిలిచారు.

వెన్నెలకు దార్ల బుక్ ఆఫ్ రికార్డు గోల్డ్‌మెడల్

జైపూర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జైపూర్ మండలంలోని ఇందారం గ్రామానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు, ఆర్ట్ ఉపాధ్యాయుడు చిప్పకుర్తి శ్రీనివాస్ కుమార్తె చిప్పకుర్తి వెన్నెల దార్ల బుక్ ఆఫ్ రికార్డు సర్టిఫికెట్, గోల్డ్ మెడల్ అందుకుంది. ఇటీవల హన్మకొండలోని సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీ 25వ డ్రాయింగ్ కాంపిటేషన్‌లో భాగంగా డ్రీమ్ ఇండియా అనే అంశంపై డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో 130 మంది పాల్గొనగా వెన్నెల ప్రతిభ కనబర్చింది. వెన్నెలకు దార్ల బుక్ ఆఫ్ రికార్డు సంస్థ చైర్మన్ డాక్టర్ దార్ల నాగేశ్వర్‌రావు, అకాడమీ డైరెక్టర్ డాక్టర్ సాగంటి మంజుల దార్లబుక్ ఆఫ్ రికార్డ్ సర్టిఫికెట్, గోల్డ్ మెడల్ అందించారు.

యూరియా కోసం రోడ్డెక్కిన రైతన్నలు

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం చౌరస్తా వద్ద ధర్నా, రాస్తారోకో




చెన్నూర్‌లో ధర్నా చేస్తున్న రైతులు, కోటపల్లిలో యూరియా కోసం బారులు తీరిన రైతులు

చెన్నూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు పట్టణకేంద్రంలో యూరియా కోసం మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతన్నలు రోడ్డెక్కారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో యూరియా పంపిణీ చేస్తున్నారనే సమాచారంతో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు, మహిళ రైతులు వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాంకు చేరుకున్నారు. గోదాంలో సంబంధిత అధికారులు కౌంటర్లు ఏర్పాటుచేసి టోకెన్‌లు ఇచ్చేందుకు ఏర్పాటు చేశారు. దీంతో రైతులు గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడ్డారు. టోకెన్‌ల పంపిణీలో అధికారులు అలసత్వం వహించడంతో కోపోద్రిక్తులైన రైతులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ రోడ్డెక్కారు. అక్కడ నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. క్యాంపు కార్యాలయం చౌరస్తా వద్ద బైఠాయించి ధర్నా, రాస్తారోకో చేశారు. రైతులకు సరిపడా యూరియా ఎందుకు పంపిణీ చేయడం లేదని ప్రశ్నించారు. విషయం తెలుసుకున్న సీఐ దేవేందర్‌రావు, ఎస్‌ఐ సుబ్బారావు అక్కడకు చేరుకుని రైతులను శాంతింపజేశారు. రైతులు అక్కడ నుంచి వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాంకు చేరుకుని క్యూలైన్‌లో ఉండి టోకెన్‌లు పొందారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా 532 యూరియా బస్తాలు రాగా ఒక్కో రైతుకు ఒక్కో యూరియా బస్తాను అందించారు. దాదాపు వెయ్యి మంది రైతులు రాగా 532 మంది రైతులకే యూరియా లభించింది. మిగితా రైతులు అధికారులు వెనుదిరిగి వెళ్లిపోయారు.

కోటపల్లి: మండల కేంద్రంతో పాటు జనగామ గ్రామంలో యూరియా కోసం సోమవారం రైతులు బారులు తీరారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ సెంటర్‌కు 440 యూరియా బస్తాలు రాగా 1100 మంది రైతులు యూరియా కోసం వచ్చారు. ఒక వైపు వర్షం పడుతున్నా ఉదయం నుంచే రైతులు బారులు తీరగా గొడుగులు పట్టుకుని క్యూలో నిల్చుని ఇబ్బందులు పడ్డారు. 440 మందికి మాత్రమే ఒక్క బస్తా చొప్పున దొరకగా మిగితా 700 మంది ఆవేదన వ్యక్తం చేశారు. జనగామలోను ఇదే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం సరిపడ యూరియా అందించాలని రైతులు కోరారు.

మోడల్ స్కూల్‌కు బస్సు ప్రారంభం

కాసిపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌కు మంచిర్యాల ఆర్టీసీ డిపో నుంచి సోమవారం బస్సు ప్రారంభమైంది. మంచిర్యాలలో ఆర్టీసీ బస్సును ఆర్టీసీ అధికారులు ప్రారంభించారు. మోడల్ స్కూల్‌కు మంచిర్యాల, బెల్లంపల్లి, మందమర్రి, సోమగూడెం తదితర ప్రాంతాల నుంచి 300 మంది విద్యార్థులు మోడల్ స్కూల్‌కు వస్తుంటారు. సరైన రవాణా సౌకర్యం లేక ప్రతి రోజు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాఠశాల సిబ్బంది, విద్యార్థి సంఘాలు ఆర్టీసీ డిపో అధికారులతో మాట్లాడి బస్సును ఏర్పాటు చేయాలని కోరగా అధికారులు సోమవారం నుంచి బస్సును ప్రారంభించారు.

ఘనంగా గణేష్ నిమజ్జనోత్సవాలు

హాజీపూర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపేట మహాత్మజ్యోతిబాపులే గురుకుల పాఠశాలలో గణేష్ నిమజ్జనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా 5వ రోజున ఎంజేపీ ఉమ్మడి జిల్లా ఆర్‌సీవో షేరు శ్రీధర్, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని నృత్యాలు చేస్తూ ఎల్లంపల్లి బ్యాక్‌వాటర్‌లో విద్యార్థులు నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ అబ్దుల్ కలీల్, ఆర్టీసీ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోటపల్లి: మండల కేంద్రంలోని పీఎంశ్రీ మోడల్ స్కూల్, కళాశాలలో ఏర్పాటు చేసిన గణపతి నిమజ్జన ఉత్సవాలను సోమవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రాజశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

న్యాయం కోసం వృద్ధురాలి ధర్నా



కాగజ్‌నగర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని చింతలమానేపల్లి సర్వే నంబర్ 14లో ఉన్న భూమిని కొంతమంది ఆక్రమిస్తున్నారని, తనకు న్యాయం చేయాలని చాపిడి సాంబయ్ (90) అనే వృద్ధురాలు కాగజ్‌నగర్‌లోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన కున్న భూమిని అధికారులు ఇతరుల పేరిట మార్పు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని వాపోయారు. తాను చనిపోయినట్లు తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సమర్పించినట్లు పేర్కొన్నారు. వృద్ధురాలి ధర్నా విషయం తెలుకొని సీఐటీయూ నాయకులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు ముంజం ఆనంద్ మాట్లాడుతూ వృద్ధురాలికి న్యాయం చేయాల్సిన అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే న్యాయం చేయాలని లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

బాలుడి మృతదేహం లభ్యం

కాగజ్‌నగర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ కోసిని డ్యాంలో ఆదివారం సాయంత్రం గల్లంతైన బాలాజీనగర్‌కు చెందిన అంకిత్ రాథోడ్(15) అనే బాలుడి మృతదేహం ఆదివారం రాత్రి లభ్యమైనట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కోసిని డ్యాం వద్దకు అంకిత్ రాథోడ్‌తో పాటు మరో ఇద్దరు వచ్చారని తెలిపారు. డ్యాంలో స్నానం చేసేందుకు దిగగా ఈత రాక అంకిత్ రాథోడ్ ఆదివారం గల్లంతు కాగా, రాత్రి మృతదేహం లభ్యమైనట్లు పేర్కొన్నారు. బాలుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

కాగజ్‌నగర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలంలోని పలు ఎరువులు దుకాణాలను సోమవారం వ్యవసాయాధికారి రామకృష్ణ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టాక్ రిజిస్టర్ సక్రమంగా చేపట్టాలన్నారు. అలాగే ఉన్న స్టాక్‌ను కూడా బోర్డుపై తెలుపాలని పేర్కొన్నారు. నానో యూరియా విక్రయాలపై దృష్టి సారించాలన్నారు. ఎరువులు అధిక ధరలకు అమ్మకాలు జరిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. ఈయన వెంట డీలర్లు, సిబ్బంది ఉన్నారు.

రైతులకు మాజీ ఎమ్మెల్యే అన్నదానం



రైతులకు అన్నదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

కౌటాల, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కౌటాల మండల కేంద్రంలో పీఏసీఎస్ వద్ద యూరియా కోసం వచ్చిన రైతులకు సోమవారం సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప నిర్వహించారు. కొన్ని రోజులుగా యూరియా అందక పడిగాపులు కాస్తున్న రైతులకు సోమవారం యూరియా పంపిణీ చేస్తామని అధికారులు తెలపడంతో వందల సంఖ్యలో రైతులు పంపిణీ కేంద్రం వద్దకు చేరుకున్నారు. రైతులు అధికసంఖ్యలో రావడంతో ఉదయం నుంచి ఆకలితో యూరియా కోసం ఎదురు చూస్తుండడంతో కోనేరు కోనప్ప రైతులకు అన్నదానం నిర్వహించారు. డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మాంతయ్య, శ్రీనివాస్‌గౌడ్, వసంత్, బ్రహ్మయ్య, ఫణిందర్‌గౌడ్, మధుకర్, బాపు, శైలజ, తిరుపతి, రవీందర్‌గౌడ్, రమేష్, సంతోష్, మనీష్ తదితరులు ఉన్నారు.

ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన



ఆసుపత్రి ఎదుట ధర్నా చేస్తున్న ఆదివాసీ సంఘాల నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ మండలంలోని గుడిగుడి గ్రామానికి చెందిన ఆత్రం రాంషావ్(25) అనే యువకుడు వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతి చెందాడని నిరసిస్తూ జిల్లా ఆసుపత్రి ఎదుట ఆదివాసీ సంఘాల నాయకులు సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్ మాట్లాడుతూ శనివారం జ్వరంతో బాధపడుతూ రాంషావ్ ఆసుపత్రికి వచ్చాడన్నారు. ఆసుపత్రిలో సరైన చికిత్స అందలేదని, వైద్యుల నిర్లక్ష్యంతోనే ఆదివారం రాత్రి రాంషావ్ మృతి చెందాడన్నారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని, రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, నిర్లక్ష్యం వహించిన వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సుమారు గంటపాటు ఆందోళన కొనసాగించారు. వైద్యాధికారి మహేష్ ఆందోళనకారుల వద్దకు చేరుకొని రాంషావ్ జ్వరం, ఫీట్స్‌తో మృతి చెందాడని, వైద్యుల నిర్లక్ష్యం ఉంటే చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు సంజీవ్, కాత్లె బాబురావు, మారుతి పాల్గొన్నారు.

స్వచ్ఛ విద్యాలయంపై ప్రతీ పాఠశాలకు రేటింగ్

జైపూర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతి పాఠశాలలో స్వచ్ఛ విద్యాలయంపై కార్యక్రమాలు నిర్వహించాలని, దానిలో భాగంగా ప్రభుత్వం రేటింగ్ ఇవ్వనుందని ఎంఈవో శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంఆర్‌సీలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీపాఠశాల స్వచ్ఛ విద్యాలయంగా నెలకొల్పడానికి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యా యులు కృషి చేయాలన్నారు. పాఠశాలలో పచ్చదనం పెంచాలన్నారు. ఈ నెల 15లోగా ప్రతి పాఠశాల రిజిస్ట్రేషన్‌ను పూర్తిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల రీసోర్స్ పర్సన్‌లు తిరుమలేష్, రవీందర్, సీఆర్‌పీలు జనార్దన్, రాజన్న, శేఖర్ పాల్గొన్నారు.

భీమారం: మండలంలోని ప్రతి పాఠశాలలో స్వచ్ఛ విద్యాలయంపై కార్యక్రమాలు నిర్వహించాలని, దానిలో భాగంగా ప్రభుత్వం రేటింగ్ ఇవ్వనుందని ఎంఈవో గోపాల్‌రావు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంఆర్‌సీలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. రేటింగ్ ఆధారంగా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పురస్కారాలు లభించనున్నాయని తెలిపారు. కార్యక్రమంలో మండల రీసోర్స్ పర్సన్‌లు కుమార్, రాజన్న పాల్గొన్నారు.

గ్రామాలను సందర్శించాలని ధర్నా

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్ర జ్యోతి): తమ గ్రామాలను కలెక్టర్, అధికారులు సందర్శించాలని కాగజ్‌నగర్ మండలం లైన్‌గూడ గ్రామ పంచాయతీలోని ఎల్లాపూర్, నవేగాం, నాయకపుగూడ గ్రామాల ఆదివాసులు తెలంగాణ ఆదివాసీ సంఘం ఆధ్వర్యలో కలెక్టర్ కార్యాలయం ఎదుట దర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాల శ్రీ, అశోక్‌లు మాట్లాడారు. ఈ గ్రామాలు కాగజ్‌నగర్ మండలంలో ఉన్నప్పటికీ కాగజ్‌నగర్ మండల కేంద్రానికి వెళ్లాలంటే రెండు మండలాలు వాంకిడి, ఆసిఫాబాద్ దాటి వెళ్లాల్సి ఉంటుందన్నారు. జిల్లా కేంద్రానికి దగ్గరగా ఉన్నప్పటికీ రోడ్డు సౌకర్యం, మంచినీరు సౌకర్యం కూడా లేదని ఇంకా గ్రామాల్లో అనేక సమస్యలు ఉన్నాయన్నారు. పరిష్కారానికి అనేక సార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. కార్య క్రమంలో నాయకులు శ్రీనివాస్, చిట్టి, టికానంద్, దినకర్, రామచందర్, మాణిక్‌రావు, సోనేరావు, సంజు, సత్తయ్య, సుధాకర్, చంద్ర శేఖర్, సోము, యేసు, తులసీ రాం, బొజ్జిరావు, చిత్రు, మారుతి, మధుకర్, బాబురావు, మహేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అన్నదానం

మందమర్రిటౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ కమిషనర్ రాజలింగు, సిబ్బంది అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకు ముందు కార్యాలయంలో ఏర్పాటు చేసిన గణపతికి కమిషనర్ కుటుంబీకులతో కలిసి పూజలు చేశారు.

గణనాథుడికి నైవేద్యాలు

లక్షెట్టిపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట పట్టణంలోని బీట్ బజార్‌లో గల శ్రీకన్యక పరమేశ్వరి అలయంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి సోమవారం 130రకాల నైవేద్యాలను మహిళలు సమర్పించారు. అర్చకులు పూజలు నిర్వహించిన అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేసారు.

వరద సహాయక చర్యలు చేపట్టండి..

సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రె, ఎస్పీ కాంతీలాల్ పాటిల్, సబ్‌కలెక్టర్ శ్రద్ద శుక్లా, అధికారులు

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల కారణంగా ఏర్పడిన వరదల వల్ల జరిగిన నష్టాలపై త్వరగా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర మంత్రులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య మంత్రి మాట్లాడుతూ ఆగస్టులో కురిసిన బారీ వర్షాల వలన జరిగిన ప్రాణ, ఆస్తి, పంట నష్టాలపై పూర్తి వివరాలతో స్పష్ట మైన నివేదిక అందించాలని ఆదేశించారు.

వ్యవసాయ రంగం, విద్యుత్, రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, మున్సిపల్, జాతీయ రహదారుల శాఖల పరిధిలో జరిగిన నష్టాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నివాస గృహాలు దెబ్బతిన్నాయని, వంతెనలు తెగిపోయాయని, ఎస్‌డీఎఫ్ నిధులతో వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని ఆదేశించారు. అన్ని శాఖల పరిధిలో జరిగిన నష్టాన్ని నివేదిక రూపంలో అందించాలని తెలిపారు. అన్ని శాఖలు కలుపుకొని ప్రాథమిక అంచనా నష్టం రూ. 4,124 కోట్లు ఉందని కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రకృతి విపత్తుల నిధులు వచ్చే విధంగా అన్ని జిల్లాల నివేదికలను క్రోడీకరించి రాష్ట్రస్థాయి నివేదిక రుపొందించాలని తెలిపారు. కలెక్టర్లు క్షేత్ర స్థాయిలో పర్యటించి నష్టాలకు సంబంధించి ప్రకృతి విపత్తుల పరిధిలోకి వచ్చే వివరాలతో నివేదిక తయారు చేయాలన్నారు. జిల్లా యంత్రాంగం ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ ప్రకృతి విపత్తులపై తక్షణమే స్పందించి ప్రజారక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంకటేష్ దోత్రే మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా జిల్లాలో ముగ్గురు మరణించారని, 46 నివాస గృహాలు దెబ్బతిన్నా యని, 50 మేకలు మృతి చెందాయని తెలిపారు. 15,000 ఎకరాల్లో పంట నష్టం, 20 పాఠశాలలు, 18 ఆరోగ్య కేంద్రాలు, ఉపకేంద్రాలు, కల్వర్టులు, రహదారులకు నష్టం జరిగినట్లు వివరించారు. ప్రభుత్వ ఆదే శాల ప్రకారం వరదల కారణంగా జరిగిన నష్టాలపై క్షేత్రస్థాయిలో పర్యటించి అధికారుల సమన్వయంతో స్పష్టమైన నివేదిక అంది స్తామని తెలిపారు. ఎస్పీ కాంతిలాల్ పాటిల్, అదనపు కలెక్టర్ డేవిడ్, కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధశుక్లా, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, డీఆర్‌డీవో దత్తరావు, ఈఈలు కృష్ణ, గుణవంత్‌రావు, డీపీవో భిక్షపతిగౌడ్, డీఎంహెచ్‌వో సీతారాం పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో జాగిలాలది కీలక పాత్ర

కాసిపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణ జాగిలాలు కీలక పాత్ర పోషిస్తాయని డిప్యూటి ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్ నాయక్ అన్నారు. సోమవారం బెల్లంపల్లి అటవీ డివిజన్ పరిధిలోని బుగ్గగూడెం, చింతగూడెం, వెంకటాపూర్ గ్రామాల్లోని ప్రజల కు అటవీ సంరక్షణ, వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించారు. ప్రవీణ్ నాయక్ మాట్లాడుతూ కవ్వాల అభయారణ్యంలోని జాగిలం (హంటర్)తో ఆదివాసీ గూడాల్లోని ప్రజలకు వివిధ అంశాలను వివరించారు. బెల్జియం జాతికి చెందిన ఈ జాగిలం కలప చెట్లను దొంగ చాటుగా నరికితే చెమట వాసనను పసిగట్టి కలప దొంగలను పట్టుకుంటుందన్నారు. ధర్మారావుపేట ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ సత్యనారాయణ, డాగ్ స్క్వాడ్ సిబ్బంది అనిల్‌కుమార్, బీట్ ఆఫీసర్ శ్రీధర్ పాల్గొన్నారు.



బుగ్గగూడెంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు



శ్రీరాంపూర్ ఏరియాలో 84 శాతం బొగ్గు ఉత్పత్తి

శ్రీరాంపూర్, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియాలో 84 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు జీఎం ఎం శ్రీనివాస్ తెలిపారు. తన కార్యాలయంలో విలేకరుతో మాట్లాడారు. ఆగస్టులో ఆర్‌కే 7 గని 104 శాతం, ఆర్‌కే న్యూటెక్ గని 114 శాతం, ఎస్‌ఆర్‌పీ 1 గని 100 శాతం, ఇందారం ఓసీపీ 127 శాతం ఉత్పత్తి సాధించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో డీజీఎం(పర్సనల్) అనిల్‌కుమార్, డీజీఎం(ఐఈడీ) రాజన్న, సీనియర్ పీవో కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి ఏరియాలో 68 శాతం...

రెబ్బెన: బెల్లంపల్లిఇ ఏరియాలో ఆగస్టు నెలలో 68 శాతం బొగ్గు ఉత్పత్తిని సాధించినట్లు జీఎం విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆగస్టు నెలలో ఏరియాలో రెండు లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాల్సి ఉండగా, వర్షాల కారణంగా 1.36 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి మాత్రమే సాధ్యమైందన్నారు. సమావేశంలో ఎస్‌ఓటూ జీఎం రాజమల్లు, ఐఈడీ ఉజ్వల్ బెహర వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రక్షణలో కాసిపేట గనికి ఉత్తమ అవార్డు

కాసిపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రక్షణ విభాగంలో కాసిపేట 1వ గనిని సింగరేణి ఉత్తమ గనిగా ఎంపిక చేసింది. 55వ మ్యానువల్ సేఫ్టీ ఫుట్‌నైట్ ప్రైజ్ డిస్ట్రిబ్యూషన్‌లో భాగంగా ఫస్ట్ ఎయిడ్, ఫస్ట్ ప్రైజ్‌ను ఆదివారం సింగరేణి సీఎండీ బలరాం నాయక్ చేతుల మీదుగా గని గుర్తింపు సంఘం నాయకులు అందుకున్నారు. ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారా మయ్య, బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, కాసిపేట గని మేనేజర్ సతీష్, సేఫ్టీ ఆఫీసర్ నిఖిల్‌అయ్యర్, పిట్ సెక్రటరీ మీనుగు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



ఉత్తమ అవార్డుతో కాసిపేట గని కార్మికులు

సంస్థ అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి



పదోన్నతి పత్రాలు అందిస్తున్న ఇన్‌చార్జి జీఎం విజయ్‌ప్రసాద్

మందమర్రిటౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ అభివృద్ధే లక్ష్యంగా ప్రతీ ఒక్కరు పనిచేయాలని మందమర్రి ఏరియా ఇన్‌చార్జి జీఎం విజయ్ ప్రసాద్ సూచించారు. సోమవారం స్థానిక జీఎం కార్యాలయంలో ఉద్యోగులకు క్యాడర్ స్కీమ్ ప్రమోషన్ పత్రాలను పంపిణీ చేసి మాట్లాడారు. క్యాడర్ స్కీమ్ ప్రమోషన్ పొందినవారు మరింత బాధ్యతగా పనిచేయాలన్నారు. క్రమశిక్షణతో విధులు నిర్వహించడం ద్వారా ఇతరులకు ఆదర్శంగా నిలుస్తారన్నారు. కార్యక్రమంలో ఏరియా పీఎం శ్యాంసుందర్, డీజీఎం ఎఫ్‌అండ్‌ఏ ప్రసాద్, సీనియర్ పీవో వంశీ, ఏఐటీయూసీ సెక్రటరీ గీతిక, ఆఫీస్ సూపరింటెండెంట్ రాజలింగు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని వివిధ గనులు, విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఎన్‌సీడబ్ల్యూ ఉద్యోగులకు జీఎం ఎం శ్రీనివాస్ పదోన్నతి పత్రాలు అందించారు. 90 మంది అర్హత కలిగిన వారి నుంచి 68 మందికి పదోన్నతులు కల్పించామన్నారు. మిగతా వారికి త్వరలో పత్రాలు అందిస్తామని పేర్కొన్నారు.

కాసిపేట: కాసిపేట 1, 2 గనుల్లో ప్రమోషన్ పొందిన క్యాడర్ స్కీమ్ పత్రాలను సోమవారం గనుల మేనేజర్లు సతీష్, లక్ష్మీనారాయణ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగుల కృషిని గుర్తించి పదోన్నతులు కల్పించారని తెలిపారు. ప్రమోషన్‌లు బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతకు తోడ్పడతాయన్నారు. ప్రతీ కార్మికుడు ఉత్పత్తి సాధనకు కృషిచేయాలని సూచించారు. కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

జాప్యం లేకుండా సీఎంపీఎఫ్ సేవలు



మాట్లాడుతున్న సింగరేణి సీఎంపీఎఫ్ రీజనల్ కమిషనర్ గోవర్దన్

మందమర్రిటౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బొగ్గు బావుల్లో పనిచేస్తున్న దేశ ప్రగతికి దోహదపడుతున్న సింగరేణి ఉద్యోగుల సీఎంపీఎఫ్ సేవలను జాప్యం లేకుండా చూస్తున్నామని సింగరేణి సీఎంపీఎఫ్ రీజనల్ కమీషనర్ గోవర్ధన్ తెలిపారు. సోమవారం స్థానిక జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎంపీఎఫ్‌కు సంబంధించిన లావాదేవీలన్నీ సీకేర్స్ పోర్టల్ ద్వారా మాత్రమే జరుగుతున్నాయన్నారు. నూతనంగా సీఎంపీఎఫ్ క్లైయిమ్‌లను పూర్తిచేయడానికి ప్రయాస్ అనే పద్ధతిని తీసుకువచ్చామన్నారు. మధ్యవర్థుల ప్రమేయం లేకుండా పారదర్శకంగా సేవలను పొందచవ్చన్నారు. ఇన్‌చార్జి జీఎం విజయ్‌ప్రసాద్, ఇన్‌చార్జి పీఎం ఎండీ ఆసీఫ్, డీవైపీఎం సందీప్, అధికారులు ఉన్నారు.

ఉపరితల గనులు లక్ష్యాన్ని చేరుకోవాలి

శ్రీరాంపూర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉపరితల గనులు లక్ష్యాన్ని చేరుకోవాల ని ఈడీ(కోల్‌మూమెంట్) వెంకన్న అన్నారు. ఏరియా జీఎం కార్యాలయంలో బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతపై సమీక్ష నిర్వహించారు. జీఎం ఎం. శ్రీనివాస్‌తో కలిసి శ్రీరాంపూర్ ఓసీపీని సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ, వర్షాకాలంలో బొగ్గు ఉత్పత్తికి ఎలాంటి నష్టం జరుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. బొగ్గు ఉత్పత్తితో పాటు పర్యావరణాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓ టు జీఎం సత్యనారాయణ, పీఓలు వెంకటేశ్వర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, గని మేనేజర్ శ్రీనివాస్, క్వాలిటీ మేనేజం వెంకటేశ్వర్ రెడ్డి, రక్షణాధికారి శ్రీధర్, సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



శ్రీరాంపూర్ ఓసీపీని పరిశీలిస్తున్న ఈడీ

డైరెక్టర్(ఈఅండ్‌ఎం) బాధ్యతల స్వీకరణ

శ్రీరాంపూర్, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): సింగరేణి డైరెక్టర్ (ఈఅండ్‌ఎం)గా మోకాళ్ల తిరుమలరావు హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా ఆయన సీఎండీ ఎన్ బలరామ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. సీఎండీ మాట్లాడుతూ ఉత్పత్తి, ఉత్పాదకత పెంపుదలకు సమర్థవంతంగా పనిచేయాలని ఆదేశించారు.

పోరాటాలకు సిద్ధం కావాలి

శ్రీరాంపూర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పోరాటాలకు కార్యకర్తలు సిద్ధం కావాలని హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు తిప్పారపు సారయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు అనిల్ రెడ్డి, కార్యదర్శి పొనగంటి అశోక్ ఒక ప్రకటనలో కోరారు. ఆగస్టు 30, 31 తేదీల్లో నిర్వహించిన యూనియన్ మహాసభల్లో పలు తీర్మానాలు చేసినట్లు పేర్కొన్నారు. కార్మికుల పక్షాన నిలుస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఉద్యమ స్ఫూర్తితో పనిచేసి ఉద్యోగుల మనసు చూరగొనాలని కార్యకర్తలకు వారు విజ్ఞప్తి చేశారు. మహాసభల విజయవంతానికి కృషి చేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ధర్నాకు తరలిన నాయకులు

మందమర్రిటౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): లాభాల వాటా ప్రకటించి 35 శాతం చెల్లించాలని, నూతన గనులను ఏర్పాటు చేయాలని తదితర డిమాండ్లతో మంగళవారం కొత్తగూడెం కార్పొరేట్ కార్యాలయం వద్ద టీబీజీకేఎస్ యూనియన్ ధర్నా చేపట్టనుంది. దీంతో సోమవారం ఏరియా నాయకులు ప్రత్యేక వాహనాల్లో కొత్తగూడెం తరలివెళ్లారు. అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, మాదాసు రామ్మూర్తి మాట్లాడుతూ యూనియన్ ఆధ్వర్యంలో పోరుబాట కార్యక్రమాలు చేపడతామన్నారు.

హరీశ్‌రావు, సంతోష్‌రావు

అవినీతి అనకొండలు

(మొదటిపేజీ తరువాయి)



మీడియా మిత్రులతో రకరకాలుగా చెప్పించారు. సోషల్ మీడియా ద్వారా ఇప్పటివరకు నాపై జరిగిన పర్సనల్ ఎటాక్‌ను ఓర్చుకుంటూ వచ్చాను. ఇంతవరకు పేరు పెట్టి చెప్పలేదు. ఇప్పుడు మొదటిసారి చెబుతున్నా. దేవుడి లాంటి మా నాన్నపై సీబీఐ విచారణ చేస్తామంటుంటే.. ఒక బిడ్డగా కడుపు రగిలిపోతోంది. అందుకే చెబుతున్నా" అని అన్నారు.

ఇంకా వాళ్లనే మోస్తారా?

"హరీశ్‌రావు, సంతోష్.. కేసీఆర్ పక్కన ఉండి, ఆయన పేరు చెప్పుకొని అనేక విధాలుగా లబ్ధి పొందారని కవిత తెలిపారు. వారి చర్యల వల్లే కేసీఆర్ పేరు బద్నామ్ అయ్యే పరిస్థితి వచ్చింది. అయినా వాళ్లనే మోస్తామని, వాళ్లనే మళ్లీ ముందుకు తీసుకెళ్తామని అనుకుంటే.. పార్టీ ఎలా ముందుకుపోతుందని ప్రశ్నించారు. "ఒక బిడ్డగా నేను బాధపడుతున్నా. ఐదేళ్లు ఇరిగేషన్ మంత్రిగా చేసిన హరీశ్‌రావుకు ఇందులో మేజర్ పాత్ర లేదా? మా నాన్న పరిస్థితి నేను దగ్గరుండి చూశాను. నా పెళ్లికి డబ్బుల కోసం ఆయన ఎంత ఇబ్బంది పడ్డారో నాకు తెలుసు. రాజకీయాల్లో 40, 50 ఏళ్లు ఉన్నా.. కేసీఆర్ ఆస్తులు సంపాదించుకోలేదు. నాకు తెలిసి ఆయనకు డబ్బుపై ఎన్నడూ ఆశలేదు. అలాంటి వ్యక్తిపై సీబీఐ విచారణ చేస్తామని, కేసులు వేస్తామని అంటే.. ఇందుకు ఎవరు కారణం? ఈ వయసులో ఆయనపై సీబీఐ కేసులేంటి? ఏం ఖర్మ? ఇలాంటి వాళ్లను ఎందుకు భరించాలి? ఎందుకు ప్రొటెక్ట్ చేయాలి? బీఆర్ఎస్ తమ్ముళ్లకు నాపై కోపం రావచ్చు. వాస్తవాలు చేదుగా ఉన్నా.. మందులాగా అప్పుడప్పుడు మాట్లాడితేనే ఆరోగ్యంగా ఉంటుంది" అని కవిత వ్యాఖ్యానించారు.

హరీశ్, సంతోష్ వెనక రేవంత్‌రెడ్డి..

కాంగ్రెస్ ప్రభుత్వం చేతకాని ప్రభుత్వమని కవిత మండిపడ్డారు. ఏసీబీ మగ్గురు కాళేశ్వరం ఇంజనీర్లను పట్టుకుంటే, ఒక్కో ఇంజనీరు దగ్గర వందల కోట్ల ఆస్తులు బహిర్గతమైతే.. విచారణ చేసే దమ్ము ప్రభుత్వానికి లేకుండాపోయిందని ధ్వజమెత్తారు. వారి వెనకాల ఎవరున్నారని ప్రశ్నించారు. "హరీశ్‌రావు, సంతోష్‌రావు వెనక రేవంత్‌రెడ్డి ఉండి కాపాడుతున్నారు. బాణం గురి ఎంతసేపూ కేసీఆర్‌పైనే ఉంది. అందుకే అన్ని విషయాల్లో వాళ్లను ఏమీ అనరు. వాళ్ల గురించి మాట్లాడరు. ఈ అవినీతి అనకొండలతో రేవంత్‌కు ఉన్న రహస్య ఒప్పందం బహిర్గతం కావాలి. పీసీ ఘోష్ కమిషన్ నివేదికలో ఏముందో చెప్పకుండానే టక్కున సీబీఐకి ఇస్తామనడం ముందస్తు కుట్ర. కేసీఆర్ ప్రతిష్ఠను దెబ్బతీయడమే వారి లక్ష్యం. మీరు బట్టకాల్చి మీదవేసినట్లు ఆరోపణలు చేయడం కాదు. నేను డిమాండ్ చేస్తున్నా.. పేర్లు కూడా చెప్పాను. దమ్ము ధైర్యం ఉంటే వారిపై విచారణ చేయించాలి. వాస్తవాలు బయటపెట్టి వారితో అండర్‌స్టాండింగ్ లేదని నిరూపించుకోవాలి" అని కవిత సవాల్ చేశారు.

ఎవరో చెబితే ఆడే తోలుబొమ్మను కాదు..!

తాను తన తండ్రికి రాసిన లేఖను లీక్ చేసిన సందర్భంలో అసలు విషయాలు బహిర్గతం చేసినందుకు 90 రోజులుగా తనను దుష్ప్రచారాలతో వేధిస్తున్నారని కవిత తెలిపారు. ఇప్పుడు కాళేశ్వరం విషయంలో వాస్తవాలు మాట్లాడినందుకూ వాళ్ల సోషల్ మీడియా బ్యాచ్‌లు రేపటి నుంచి అడ్డగోలు విమర్శలు చేస్తాయన్నారు. "నన్ను బీజేపీ ఆపరేట్ చేస్తుందంటారు. కాంగ్రెస్ ఆపరేట్ చేస్తుందంటారు. ఒకరు రేవంత్‌రెడ్డి చెబితే మాట్లాడుతుందని, మరొకరు బండి సంజయ్ చెబితే మాట్లాడుతుందంటూ దుష్ప్రచారం చేస్తారు. ఖబడ్దార్ బిడ్డా.. నేను ఎవరో చెబితే ఆడే తోలుబొమ్మను కాదు. నాది కేసీఆర్ రక్తం.. తెలంగాణ బ్లడ్. వ్యక్తిగతంగా నేను అనుకున్న విషయాన్ని చెబుతున్నా. దానికి రాజకీయంగా ఇబ్బంది అయినా, నష్టమయినా, కష్టమయినా.. నేనే భరిస్తా" కవిత స్పష్టం చేశారు.

ఇలాంటి పార్టీ ఉంటే ఏంది? పోతే ఏంది?

దేశంలో ఎక్కడికి వెళ్లినా.. కేసీఆర్ మహానాయకుడు అంటారని కవిత తెలిపారు. ఇప్పుడు సీబీఐ విచారణ జరిపితే.. ఏం మాట్లాడతారని ప్రశ్నించారు. "మా నాన్న పరువు పోతే నాకు బాధ. మీకా? వాళ్లకు పైసలు కావాలె. పేరుతో ఏం పని? ఇంక కూడా ఇటువంటి విషయాలు అర్థం చేసుకోకుండా, ఇలాంటి వ్యక్తులను దూరం పెట్టకుంటే.. ఇలాంటి పార్టీ ఉంటే ఏంది? పోతే ఏంది? బీఆర్ఎస్ నాయకులు నన్ను తిట్టుకున్నా సరే. స్థానిక ఎన్నికల్లో నష్టం జరుగుతదని అనుకున్నా సరే. మా నాన్నమీద సీబీఐ విచారణ పడ్డాక ఏముంది? ఎలక్షన్‌లో ఒకరు గెలుస్తరు, ఒకరు ఓడిపోతరు. అసలు పార్టీ ఓడిపోయే పరిస్థితి ఎందుకు వచ్చింది? ఇటువంటి దుర్మార్గుల వల్ల కాదా? ఈ అంటే.. మా దగ్గర పైసలున్నయని, టీవీలున్నయని, సోషల్ మీడియాలుయని ఎటు పడితే అటు మాట్లాడతామంటే తోలు తీస్తం. గీత గీసుకుంటం బిడ్డా. మీరు ఒక కామెంట్ పెడితే.. మేం పది పెడతాం. ఇంతకాలం చూస్తూ ఊరుకున్నా. పెద్ద సారు దగ్గరికి వచ్చాక ఇక కాంప్రమైజ్ అయ్యేది లేదు. నిజంగానే ఆయన అవినీతికి పాల్పడితే వేరుమాట. కేసీఆర్‌కు ఎప్పుడూ తెలంగాణ ధ్యాసే.. అదే పిచ్చి. అలాంటి వ్యక్తిపై ఏది పడితే అది మాట్లాడితే.. రియాక్ట్ కాకపోవడం చాలా దారుణం. సీబీఐ విచారణ చేస్తున్నామని రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటిస్తే.. తెలంగాణ బంద్‌కు పిలుపు ఇవ్వొద్దా? తెలంగాణ భగ్గుమనొద్దా? దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నా. ఏదేమైనా సీబీఐ విచారణ చేసినా.. కేసీఆర్ కడిగిన ముత్యంలా బయటకు వస్తారు" కవిత పేర్కొన్నారు.

మూడు పిల్లర్లు కుంగిపోతే రెండున్నరేళ్లుగా లొల్లి!

కేసీఆర్ తరతరాలకు తరగని ఆస్తిలా కట్టిన కాళేశ్వరాన్ని బద్నామ్ చేస్తున్నారని కవిత అన్నారు. "మహాసముద్రం లాంటి కాళేశ్వరంలో చిన్న పార్ట్ అయిన మేడిగడ్డలో మూడు పిల్లర్లు కుంగిపోతే.. ప్రాజెక్టు మొత్తం కూలిపోయిందని రెండున్నరేళ్లుగా లొల్లి పెడుతున్నారు. నేను 2006 నుంచి తెలంగాణ ఉద్యమంలో పాల్గొంటూ రాజకీయాల్లో యాక్టివ్‌గా ఉన్నాను. అప్పటినుంచి ఇప్పటివరకు ప్రజల విషయం తప్ప.. వ్యక్తిగత విషయాలు మాట్లాడరు. అటువంటి మహానాయకుడు అవినీతికి పాల్పడ్డారని, లక్ష కోట్లు దోచుకున్నారని, నిజాం కన్నా ధనికుడు కావాలనుకున్నారని అంటున్నారు. అవును కచ్చితంగా నిజాం బాటలోనే నడుస్తాం. నిజాం కట్టిన ఉస్మాన్‌సాగర్ నీళ్లే కదా.. నేటికీ హైదరాబాద్ ప్రజలు తాగుతున్నది! ఆ నిజాం స్ఫూర్తి అని మా నాన్న చాలాసార్లు చెప్పారు. కచ్చితంగా 200 ఏళ్లు తెలంగాణ ప్రజలు కాళేశ్వరం ప్రాజెక్టును కట్టిన కేసీఆర్‌ను తలుచుకుంటారు. కేసీఆర్‌కు ఉన్న అవగాహన, ఉమ్మడి ఏపీలో ఆయన అనుభవించిన వివక్ష, తెలంగాణకు వ్యతిరేకంగా పనిచేసిన ప్రస్తుత సీఎంకు తెలియదు. నేటికీ ఆయన పక్క రాష్ట్రం ఎజెండాను అమలు చేస్తున్న వ్యక్తి. బనకచర్ల కడతామంటే మాట్లాడని వ్యక్తి.. కేసీఆర్ గురించి అసెంబ్లీలో ఉదయం నుంచి రాత్రి వరకు అనరాని మాటలు అంటుంటే నా గుండె బరువెక్కింది. ఇదే రేవంత్‌రెడ్డి గతంలో ఓ టీవీ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, 'కేసీఆర్‌కు పైసల మీద ఆశలేదు. పాపం ఆయన మీటింగ్ పెట్టాలంటే కూడా.. అప్పుడు పైసల గురించి చూస్తారు' అన్నారు. అటువంటి ఆలోచన ఉన్న వ్యక్తిమీద ఇంత కుట్రపూరితంగా అభాండాలు ఎందుకు వేస్తున్నారు? ప్రజలు తిరగబడతారనుకుంటే.. ప్రభుత్వం తప్పులు బయటపడతాయంటే.. కేసీఆర్‌పై ఆరోపణ చేయాలి. ఆయన పేరు చెప్పకుంటే రేవంత్‌రెడ్డి ఫొటో కూడా పేపర్లో వేయరని ఆయన్ను విమర్శిస్తున్నారు. సెప్టెంబర్ 30లోపు ఎన్నికలు పెడతామని, 50శాతం రిజర్వేషన్లు ఎత్తేస్తామని అంటున్నారు. రాహుల్‌గాంధీ బిహార్ ఎన్నికల ప్రచారం కోసం బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ రోజుకో కొత్తకథ చెబుతోంది. గవర్నర్ వద్ద పెండింగ్ పెడితే.. సుప్రీంకోర్టుకు ఎందుకు వెళ్లడంలేదు? బిహార్ ఎన్నికల కోసమే బీసీ బిడ్డలను రేవంత్‌రెడ్డి బలి పెడుతున్నారు. ఇలాగే చేస్తే.. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా బిహార్‌కు వెళ్లి ప్రచారం చేస్తాం" అని కవిత హెచ్చరించారు.

కవిత

సస్పెన్షన్ ఖాయం!?

నేడో, రేపో బీఆర్ఎస్ నుంచి ప్రకటన!.. కీలక నేతలతో అధినేత కేసీఆర్ భేటీ

- ఉపేక్షిస్తే పార్టీకి మరింత నష్టం అనే అభిప్రాయం
- ఎక్స్‌లో కవితను అన్‌ఫాలో చేయాలని ఆదేశం
- బీఆర్ఎస్ఎల్పీ వాట్సప్ గ్రూప్ నుంచి కవిత పీఆర్వో అవుట్
- సస్పెండైతే తెలంగాణ జాగృతి పేరుతో కవిత సొంత పార్టీ?



హైదరాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సొంత పార్టీకి చెందిన నేతలు హరీశ్‌రావు, జోగినపల్లి సంతోష్ కుమార్‌పై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలుస్తోంది. కవిత తీరుతో పార్టీకి మరింత నష్టం జరిగేలోపే ఆమెను బీఆర్ఎస్ నుంచి సాగనంపాలనే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ఈ క్రమంలో పార్టీ నుంచి కవిత సస్పెన్షన్ ఖాయం అనే ప్రచారం బీఆర్ఎస్ వర్గాల్లో జోరుగా సాగుతోంది. దీనిపై ఒక ట్రెండు రోజుల్లో బీఆర్ఎస్ నుంచి అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మీడియా సమావేశంలో హరీశ్, సంతోష్‌పై కవిత సంచలన వ్యాఖ్యలు చేశాక.. ఆ పార్టీ సీనియర్ నేతలు ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు వెళ్లారు. అక్కడ కేటీఆర్, వేముల ప్రశాంత్ రెడ్డి, జగదీశ్ రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డితో పాటు మరికొందరు కీలకనేతలు కేసీఆర్‌తో భేటీ అయ్యారు. పార్టీలో జరుగుతున్న పరిణామాలపై కేసీఆర్‌తో మంతనాలు జరిపారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. కవిత పార్టీలో ఉంటే లాభం ఉందా? అంటూ పార్టీ నేతలను కేసీఆర్ ప్రశ్నించారు. ఇంత పెద్ద వ్యాఖ్యలు చేశాక కూడా కవితను కొనసాగిస్తే పార్టీకి మరింత నష్టం అని, ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని మెజారిటీ నేతలు కేసీఆర్‌కు సూచించారు. కవితను పార్టీలో కొనసాగితే విపక్షాలకు ఆయుధం ఇచ్చినట్లేనని నేతలు అభిప్రాయపడ్డారు. కవితపై ఎటువంటి చర్యలు తీసుకోకపోతే ముందు మరింత నష్టం జరిగే ప్రమాదం ఉందని అధినేతకు చెప్పారు. కవిత ఇదివరకే.. కేసీఆర్ చుట్టూ దయ్యాలున్నాయంటూ వ్యాఖ్యానించారు. అప్పుడే ఆమెపై నిర్ణయం తీసుకుంటారని అంతా భావించారు. అయితే ఆమెపై ఎలాంటి చర్యలు తీసుకోకుంటేనే తక్కువ నష్టం జరుగుతుందనే భావన అప్పట్లో పార్టీ పెద్దల్లో ఉండిందని.. ఇప్పుడు చేయిదాటిపోయే స్థాయికి పరిస్థితి చేరిందని ఓ కీలక నేత చెప్పారు.

కవితపై బీఆర్ఎస్ నేతల మాటల దాడి

సామాజిక మాధ్యమాల్లో కవితను వెంటనే అన్‌ఫాలో కావాలని బీఆర్ఎస్ ఐటీ విభాగం నుంచి పార్టీ శ్రేణులకు ఆదేశాలు వెళ్లినట్లు గులాబీ వర్గాలు చెబుతున్నాయి. ఆ వెంటనే ఎక్స్ ఖాతాలో కవితను ఫాలో అవుతున్న కార్యకర్తలు వెంటవెంటనే అన్‌ఫాలో అయ్యారు. సామాజిక మాధ్యమాల్లో ఆమెకు వ్యతిరేకంగా కామెంట్లు పెట్టడం మొదలుపెట్టారు. ఎలక్ట్రానిక్ మీడియాలో బీఆర్ఎస్ తరఫున చర్చలకు వెళ్లిన నేతలు కూడా కవిత తీరును తీవ్రంగా తప్పుబట్టారు. కొందరైతే కవిత తీరు వల్లే గత ఎన్నికల్లో పార్టీ ఘోర పరాజయం పాలైందని ఆరోపించారు. మరికొందరు తక్షణమే ఆమె పార్టీకి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ఎల్పీ వాట్సప్ గ్రూప్ నుంచి కవిత పీఆర్వోను తొలగించారు. హరీశ్‌రావు ఆరడుగుల బుల్లెట్ అంటూ బీఆర్ఎస్ సోషల్ మీడియా విభాగం పోస్టులు పెట్టింది. లండన్ పర్యటనలో ఉన్న హరీశ్‌రావుకు అక్కడి బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ విభాగం ఘనస్వాగతం పలికింది.

సస్పెండ్ చేస్తే సొంతపార్టీ?

బీఆర్ఎస్ నుంచి కవితను సస్పెండ్ చేస్తే .ఆమె అడుగులు ఎటువైపు? అన్న చర్చ రాజకీయ వర్గాల్లో మొదలైంది. అయితే మొదట్నుంచి ఆమె ఒక స్పష్టతతో ఉన్నారని, పార్టీ నుంచి బయటకు వెళ్లాల్సివస్తే, సొంత వేదిక ఏర్పాటు చేసుకోవాలని ముందే నిర్ణయం తీసుకున్నారని విశ్లేషకులు అంటున్నారు. 2023 ఎన్నికల్లో పార్టీ పరాజయం పాలైనప్పటి నుంచి ఆమె తన జాగృతి సంస్థను నెమ్మదిగా బలోపేతం చేస్తూ వస్తున్నారు. జాగృతి పేరుతో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పార్టీ పెడితే తెలంగాణ జాగృతినే పార్టీ పేరుగా ఖరారు చేసే అవకాశం ఉందని ఆమె సన్నిహితులు చెబుతున్నారు. కొత్త పేరు జోలికి వెళ్లకపోవచ్చని ఆ వర్గాలు అంటున్నాయి.

పింఛన్ తిప్పలు..

(5వ పేజీ తరువాయి)

కాలినడక వెళ్లాలి. పింఛన్లు అందుకున్న తరువాత తిరుగు ప్రయాణంలో తిమ్మాపూర్ నుంచి బస్సులో నేరుగా బొక్కలగుట్ట వరకు ప్రయాణించాలి. ఈ క్రమంలో పింఛన్ల లబ్ధిదారులంతా రాకపోకలు సా గించడానికి మూడు బస్సులు మారాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. ఒకవేళ సమయానికి పోస్టాఫీస్ వద్దకు చేరుకోని పక్షంలో మరోసారి వెళ్లాల్సి వస్తోందంటున్నారు. బస్సులో కాకుండా ఆటోల్లో ప్రయాణం చేయాలంటే రానుపోను కనీసం రూ. 100 చార్జీ వెచ్చించాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. గతంలో రేషన్ సరుకుల పరిస్థితి కూడా ఇలాగే ఉండేదని, తిమ్మాపూర్‌కు వెళ్లి తెచ్చుకొనే వారమని, తమ ఆవేదనను గుర్తించిన అధికారులు రేషన్ సరుకులను తమ గ్రామంలోనే అందించే వెసు లుబాటు కల్పించారని పేర్కొంటున్నారు. రేషన్ మాదిరిగా పింఛన్లు కూడా తమ గ్రామాల్లో ఇవ్వాలని లబ్ధిదారులు వేడుకుంటున్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదుతో కదిలిన యంత్రాంగం....

పింఛన్ల కోసం బొక్కలగుట్ట, పులిమడుగు గ్రామాల లబ్ధిదారులు పడుతున్న అవస్థలపై సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల విభాగంలో బొక్కలగుట్ట నివాసి బల్లికొండ కిషన్ కలెక్టర్ కుమార్ దీపక్‌కు రాతపూర్వక ఫిర్యాదును అందజేశారు. బొక్కలగుట్ట, పులిమడుగు గ్రామ పంచాయతీలకు బ్రాంచ్ పోస్టుమాస్టర్ వచ్చి లబ్ధిదారులకు పింఛన్లు అందించే ఏర్పాటు చేయాలని కోరారు. తక్షణమే స్పందించిన కలెక్టర్ అక్కడే ఉన్న డీఆర్‌డీఏ పీడీని సమస్య పరిష్కరించాలని ఆదేశించడంతో తిమ్మాపూర్ పోస్టుమాస్టర్ హుటాహుటిన ఆయా గ్రామాలకు వెళ్లి లబ్ధి దారులకు ఫించన్ సొమ్మును అందజేయడం గమనార్హం. ఇంతకాలం పింఛన్ల కోసం వృద్ధులను ఇబ్బంది పెట్టిన పోస్టుమాస్టర్, కలెక్టర్‌కు ఫిర్యాదుతో కదిలినప్పటికీ, ప్రతినెలా గ్రామానికి వచ్చి నగదు అందజేయాలనే విజ్ఞప్తులు వినిపిస్తున్నాయి.

గర్భిణికి రక్తదానం..

మానవత్వం చాటిన రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర నాయకుడు మధుసూదన్



రక్తదానం చేస్తున్న మధుసూదన్ రెడ్డి

రామకృష్ణాపూర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రామకృష్ణాపూర్ సింగరేణి ఆసుపత్రిలో ఓ గర్భిణి ఆపరేషన్ కోసం అరుదైన ఏబీ నెగిటివ్ రక్తాన్ని రెడ్‌క్రాస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మధుసూదన్‌రెడ్డి అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. సోమవారం శస్త్ర చికిత్స ఉందని రక్తం అవసరం ఉందని తన దృష్టికి తీసుకురావడంతో రామకృష్ణాపూర్ సింగరేణి ఏరియా ఆసుపత్రి వైద్యులు ప్రసన్న కుమార్ సమక్షంలో అందించినట్లు తెలిపారు. 48వ సారి రక్తదానం చేయడంతో ఆసుపత్రి వైద్యులు, మంచిర్యాల రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు, లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ సభ్యులు మధుసూదన్ రెడ్డిని అభినందించారు.

బిల్లులు చెల్లించలేదని పాఠశాలకు తాళం

తాండూర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో చేసిన పనులను బిల్లులు చెల్లించడం లేదని పేర్కొంటూ సోమవారం మండలంలోని బారేపల్లి గ్రామంలోని ప్రైమరీ పాఠశాలకు పనులు చేసిన కాంట్రాక్టర్ భీమన్న తాళం వేశాడు. అలాగే రేచిని గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలకు కాంట్రాక్టర్ కొమురయ్య తాళం వేశాడు. వారు మాట్లాడుతూ మండలంలోని రేచిని గ్రామపంచాయతీలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో 2022-23 సంవత్సరంలో పాఠశాలల్లో మరమ్మతులు, మరుగుదొడ్లు, కిచెన్ షెడ్ల, ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టామన్నారు. ఇప్పటి వరకు సగం బిల్లులు చెల్లించారన్నారు. ఇంకా సగం బిల్లులు రావాల్సి ఉందని, తాను తీవ్ర ఇబ్బందులు పడుతున్నానని అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. దీంతో పాఠశాలకు తాళం వేసినట్లు తెలిపాడు.

ప్రజల దృష్టిని మరల్చేందుకే కాళేశ్వరంపై కుట్ర

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్



సమావేశంలో మాట్లాడుతున్న బాల్క సుమన్, బీఆర్ఎస్ నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజల దృష్టిని మరల్చి స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరంపై అవినీతి కుట్రకు పాల్పడుతోందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం విషయంలో కేసీఆర్, హరీష్‌రావులను బద్నాం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని, ఒకే బ్యారేజీకి రెండు పగుళ్లు వస్తే బ్యారేజీ కూలిపోయినట్లుగా ప్రచారం చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. కావాలని కేసీఆర్‌పై కక్ష సాధింపు చర్యలకు సీఎం పాల్పడుతున్నాడన్నారు. కేసీఆర్ హయాంలో కట్టిన కాళేశ్వరంపై బద్నాం చేస్తున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కాంగ్రెస్ హయాంలో కట్టిన మిగితా ప్రాజెక్టులపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. పాత గురువు చంద్రబాబునాయుడు, కొత్త గురువు అయిన ప్రధాని మోదీకి గురుదక్షణకు 465 టీఎంసీల నీటిని దారాదత్తం చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి పథకం రచించారన్నారు. మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి మండలంలో నిరసన కార్యక్రమాలను చేపడతామని, కాళేశ్వరం అవినీతికి గురైతే నాడు మహారాష్ట్ర సీఎం, ఇతర మేధావులు సమర్థించేవారు కాదని, ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు మానుకోవాలన్నారు. నస్పూర్, మంచిర్యాల అధ్యక్షులు గాదె సత్యం, సుబ్బన్న, రాజారమేష్, రాజయ్య, సరోజ, ప్రభాకర్, సురేందర్‌రె డ్డి, తిరుపతి, నరేష్, రాజు, రాజేశం, భీమయ్య పాల్గొన్నారు.

కేసీఆర్ నాయకత్వాన్ని గెలిపించాలి

జైపూర్ : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కేసీఆర్ నాయకత్వాన్ని గెలిపించి బీఆర్ఎస్‌కు పూర్వ వైభవం తీసుకువచ్చేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని మాజీ ప్రభుత్వ విప్, చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు అప్పుడే బాగుండే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముఖ్యంగా రైతులు ఎదుర్కొంటున్న యూరియా సమస్యను మాజీ ఎమ్మెల్యేకు విన్నవించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అరవిందరావు, జిల్లా నాయకులు మధుకర్‌రెడ్డి, రమేష్, లింగస్వామి, గోపాల్‌రెడ్డి, మేడి తిరుపతి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు

రామకృష్ణాపూర్: సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో ప్రజలంతా అనేక ఇబ్బందులు పడుతున్నారని మంచిర్యాల జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. సోమవారం రామకృష్ణాపూర్ రాజీవ్‌చౌక్ లో బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలు అప్పుడే మంచిగా ఉండే అనే కార్యక్రమం సందర్భంగా ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలపై ఉద్యమించేందుకు నియోజకవర్గ వ్యాప్తంగా కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన అన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ రాజా రమేశ్, పట్టణ అధ్యక్షుడు కంభగోని సుదర్శన్ గౌడ్, సీనియర్ నాయకులు రామిడి కుమార్, అలుగుల సత్తయ్య, మాజీ కౌన్సిలర్లు పోగుల మల్లయ్య, ఓడెలు, మహేశ్, అనిల్‌రావు, వార్డు ఇన్‌చార్జిలు నంది పేట్ సదానందం, శ్రీనివాస్ పాల్గొన్నారు

●పట్టణ రజక సంఘం నాయకులు మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్‌ను ఘనంగా సన్మానించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రజక సంఘం కోసం చేసిన అభివృద్ధి పనులను గుర్తు చేసుకుంటూ సన్మానం చేపట్టినట్లు నాయకులు రాజయ్య, తిరుపతి, శ్రీనివాస్ పాలొన్నారు.

ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా అనిత

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఇన్‌చార్జీ డీఎంహెచ్‌వోగా అనిత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు పని చేసిన డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్ ఉద్యోగ విరమణ పొందగా ఇన్‌చార్జీ డీఎంహెచ్‌వోగా అనిత నియమితులయ్యారు.

ప్రణాళికలు సిద్ధం చేయాలి

జైపూర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రైళ్ల ద్వారా వచ్చే బొగ్గు రవాణా మార్గాన్ని పరిశీలిస్తూ ప్రతి రోజు 4 నుంచి 5 రేకుల బొగ్గు వచ్చే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సింగరేణి ఈడీ (కోల్ మూమెంట్) వెంకన్న జాదవ్ పేర్కొన్నారు. సోమవారం జైపూర్‌లోని సింగరేణి ఎస్టీపీపీలో పర్యటించారు. అధికారులకు తగు సూచనలు చేశారు. కోల్ యార్డును, రైల్వే ట్రాక్‌లైన్, ట్రాక్ ఆపర్‌లను తనిఖీ చేశారు. బొగ్గు రవాణలో ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

పొలాల్లోకి చేరిన వరద నీరు

మందమర్రిరూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మంలంలోని పొన్నారం గ్రామంలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి రైతుల పొలాల్లోకి వరద నీరు చేరడంతో రైతులు నష్టపోయారు.

సంక్షిప్త సమాచారం

బాధ్యతలు స్వీకరించిన సీసీలు

నెన్నెల : గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఐకేపీలో భారీగా బదిలీలు చోటు చేసుకున్నాయి. మండలానికి నూతన క్లస్టర్ కోఆర్డీనేటర్(సీసీ)లు వచ్చారు. మంచిర్యాల హెడ్ ఆఫీస్ నుంచి సత్యనారాయణగౌడ్ కుశ్నపల్లికి, భీమిని నుంచి వసంత్ నెన్నెలకు, కుశ్నపల్లి నుంచి శ్రీనివాస్ చిత్తాపూర్‌కు, మైలారం నుంచి సువర్ణ ఆవడంకు, చిత్తాపూర్ నుంచి గంగరాజ్ మైలారం క్లస్టర్‌కు బదిలీపై వచ్చారు. వారందరు సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

పాఠశాలలో మాక్ ఎలక్షన్స్

జన్నారం: రాఘవేంద్ర లిటిల్ హన్స్ హై స్కూల్ జన్నారంలో సోమవారం హెడ్‌బాయ్, హెడ్‌గర్ల్ ఎంపిక కోసం స్కూల్‌లో మాక్ ఎలక్షన్స్ నిర్వహించారు. పాఠశాల ప్రెసిడెంట్ ప్రమీల ప్రభాకర్ మొదటి ఓటు వేసి ప్రారంభించారు. స్కూల్ ఛైర్మన్ ఎర్ర చంద్ర శేఖర్, శీల రమేశ్, కరస్పాండెంట్ ఎర్ర సంపత్, హైస్కూల్ డైరెక్టర్స్ ఎర్ర మహేశ్, ఎర్ర నరేశ్, ఓటును వినియోగించుకున్నారు. ప్రిన్సిపాల్ ఎదులాపురం శ్రీనివాస్, అకాడమిక్ డీన్ హేమలత షిండే, అలాగే స్కూల్ విద్యార్థులు, పాఠశాల సిబ్బంది తమ ఓటును వినియోగించుకున్నారు.

నేటి నుంచి పంట నష్టంపై సర్వే

వేమనపల్లి : మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు నీట మునగగా పంట నష్టంపై మంగళవారం నుంచి సర్వే నిర్వహించనున్నట్లు ఏవో వీరన్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పారిశుధ్య పనులను చేపట్టాలి

కాసిపేట: పది రోజులుగా జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు గిరిజన గూడాలు అస్తవ్యస్తంగా మారాయని, వెంటనే గూడాల్లో పారిశుధ్య పనులను చేపట్టాలని సీపీఎం జిల్లాకార్యదర్శి సంకె రవి అన్నారు. సోమవారం కాసిపేట మండలంలోని పలు గిరిజనగూడాల్లో నాయకుల బృందంతోకలిసి పర్యటించారు. సీపీఎం నాయకులు పాయిరాల రాములు, గిరిజనులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

తాండూర్: మండలంలోని నీలాయపల్లి గ్రామంలో పారిశుధ్య పనులను మండల పంచాయతీ అధికారి అనిల్‌కుమార్ పరిశీలించారు. కార్యదర్శి రంజిత్‌కుమార్ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించండి..

దండేపల్లి: మండలంలోని నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ నాయకులు మంచిర్యాల కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణి గ్రీవెన్స్‌లో వినతిపత్రాన్ని సమర్పించారు. డీఆర్డీవో కిషన్‌కు వెల్గనూర్ గ్రామస్థులు వినతిపత్రాన్ని బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు గోపతి రాజయ్య, నాయకులు లక్ష్మీనారాయణ, బీజేవైఎం జిల్లా కార్యదర్శి సంజవ్, బూత్ అధ్యక్షుడు సంతోష్ సమర్పించారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

జైపూర్ : మణుగూరులో ఇటీవల జరిగిన చెరువులో పడి మృతి చెందిన సింగరేణి కార్మికుడు సుంకరి శ్రీనివాస్ కుటుంబాన్ని మాజీ ప్రభుత్వ విప్, మంచిర్యాల జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు బాల్క సుమన్ సోమవారం పరామర్శించారు. మండల పార్టీ అధ్యక్షుడు అరవిందరావు, రిక్కుల మధుకర్‌రెడ్డి, భాస్కర్, రాజారమేష్‌లు పాల్గొన్నారు.

దండేపల్లి ఎస్సై తాసినోద్దీన్‌కు రివార్డు

దండేపల్లి : చెన్నూర్ పట్టణంలో ఎస్‌బిఐ-2 స్కాం కేసు ఛేదనలో కీలకంగా వ్యవహరించిన ఎస్సై ఎండి తహసీనోద్దీన్‌ను సీపీ అంబర్ కిషోర్ ఝా అభినందించారు. ఎస్సైకి రివార్డు అందజేశారు.

రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి

జైపూర్: రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తిని సాధించాలని సింగరేణి డైరెక్టర్ (పీపీ) వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సోమవారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఐకే 1ఏ గనిని జీఎం శ్రీనివాస్‌తో కలిసి సందర్శించారు. పని స్థలాలను పరిశీలించారు. వరాహ ఓబీ కాంట్రాక్టు కంపెనీకి నిర్దేశించిన రోజు వారీ లక్ష్యాన్ని సాధించడానికి కావాల్సిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం నస్పూర్‌లోని సమీకృత భవన సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రయ్య, ఆర్డీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని మార్క్స్‌భవన్‌లో రెండు రోజులుగా నిర్వహించిన పీడీఎస్‌యూ రాష్ట్ర , విద్య, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులు విజయవంతంగా ముగిశాయని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ శిక్షణ తరగతులకు వివిధ జిల్లాల నుంచి ప్రతినిధులు వచ్చారని, ప్రొఫెసర్‌లు హాజరై తరగతులు బోధించారన్నారు. నాయకులురెడ్డి చరణ్, సికిందర్, రాజ్‌కుమార్, రాహుల్, కార్తీక్, గీత, శంకర్ పాల్గొన్నారు.

ఘనంగా వినాయకుడి శోభాయాత్ర

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో గణపతి నవరాత్రుల సందర్భంగా ఐదవ రోజున పలు హాస్టళ్లలో, అపార్టుమెంట్లలో, కార్యాలయాల్లో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలకు సోమవారం డప్పుచప్పుళ్లతో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం గోదావరిలో నిమజ్జనం చేశారు. గిరిజన సంఘం నాయకులు లక్ష్మణ్, స్వచ్ఛంద సంస్థల నాయకులు ధర్మేందర్, రీణా, రాజు, శ్రీనివాస్, సంజీవ్ పాల్గొన్నారు.

గణనాథుడికి ఘనంగా పూజలు

బెల్లంపల్లి, సెప్టెంబర్1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో కొలువుదీరిన గణనాథులకు సోమవారం భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. పలు వినాయక మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. దీంతో వినాయక మండపాల వద్ద భక్తులతో పెద్ద ఎత్తున సందడి నెలకొంది.

ఎస్పీని కలిసిన అదనపు ఎస్పీ

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ డీఎస్పీగా పనిచేస్తున్న బి రామానుజం అదనపు ఎస్పీగా పదోన్నతి పొందడంతో ఎస్పీ కాంతిలాల్ పాటిల్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అదనపు ఎస్పీ రామానుజంను డీజీపీ ఆఫీసులో రిపోర్టు చేయాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి.

కొనసాగుతున్న సర్వే

సిర్పూర్(టి), సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల మూలంగా వరదలతో ముంపుకు గురైన పంటలను ఏవో గిరీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఏఈవోలు సర్వే నిర్వహించారు. సోమవారం మండలంలోని నవేగాం, టోంకిని, పారిగాం గ్రామాల్లో ముంపునకు గురైన పంటలను సర్వే చేశారు. కార్యక్రమంలో ఏఈవోలు విశాల్, రవి, నేహాతబసుం, శోభ ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

లింగాపూర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీవో రామచందర్ అన్నారు. మండలంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పనులు వేగవంతం చేసి ప్రభుత్వ లక్ష్యాన్ని నేరవేర్చాలని అన్నారు. ప్రభుత్వం విడతల వారీగా నిధులు విడుదల చేస్తుందని తెలిపారు.

విద్యార్థుల ప్రతిభ

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణంలోని ఓ షాపింగ్ మాల్ ఆధ్వర్యంలో వినాయక చవితి సందర్భంగా సోమవారం నిర్వహించిన ఆర్ట్ కాంపిటేషన్‌లో పట్టణంలోని సరస్వతీ శిశు మందిర్ విద్యార్థులు సోనాలి బిందు, సుదీక్ష మొదటి బహుమతి సాధించారు. కార్యక్రమంలో స్టోర్ మేనేజర్ తిరుపతి, నరేష్, ప్రధానాచార్యులు కోటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రవాణా చెక్‌పోస్టుల ఎత్తివేత

- జీవో జారీ చేసిన ప్రభుత్వం
- సిబ్బందికి మొబైల్ స్క్వాడ్ బాధ్యత
- ఆన్‌లైన్ సేవలపై అవగాహన కల్పించనున్న సిబ్బంది


వాంకిడి చెక్‌పోస్టు



చెక్‌పోస్టు వద్ద ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ సేవల బోర్డు

వాంకిడి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సరిహద్దుల్లో రవాణాశాఖ చెక్‌పోస్టులను తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. జీవో ఎంఎస్ నంబర్ 58ని ఆగస్టు 28న రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. సరిహద్దుల్లోని చెక్‌పోస్టులను తొలగించేందుకు చర్యలు తీసుకుంటుంది. ఇప్పటికే చెక్‌పోస్టుల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ఆరునెలల పాటు మొబైల్ స్క్వాడ్ విధులు కేటాయించారు. ప్రధానంగా పన్ను చెల్లించకుండా రాష్ట్రంలోకి ఇతర రాష్ట్రం నుంచి సరకు వాహనాలు రాకుండా చూడటమే వీరి విధి. అంతే కాకుండా కేంద్ర ప్రభుత్వం ద్వారా ఇప్పటికే అమల్లో ఉన్న ఆన్‌లైన్ వాహన్ సాఫ్ట్‌వేర్‌ను రాష్ట్రంలో కూడా అమల్లోకి తీసుకువచ్చారు. ఇప్పటి వరకు ఆయా చెక్‌పోస్టుల్లో లభించే వివిధ రకాల సేవలను ఇకపై ఆన్‌లైన్‌లో జారీ చేసేలా ఈ సాఫ్ట్‌వేర్ ఉపయోగ పడనుంది. అలాగే చెక్‌పోస్టుల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఆరు నెలల పాటు వాహన డ్రైవర్లకు ఆన్‌లైన్‌పై అవగాహన కల్పించనున్నారు. ప్రభుత్వం చెక్‌పోస్టులను తొలగిస్తూ జీవో జారీ చేసినప్పటికీ రవాణా శాఖ కమిషనర్ తదుపరి ఆదేశాల వరకు చెక్ పోస్టుల్లో సిబ్బంది సేవలపై స్పష్టత రానుంది.

● ఉమ్మడి జిల్లాలో మూడు చెక్‌పోస్టులు..

రాష్ట్రవ్యాప్తంగా రవాణా చెక్‌పోస్టులు మొత్తం 15 ఉండగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మూడు రవాణా చెక్‌పోస్టులు ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లాలో భోరజ్, నిర్మల్ జిల్లాలో భైంసా, ఆసిఫాబాద్ జిల్లాలో వాంకిడిలో సరిహద్దుగా రవాణాశాఖ చెక్‌పోస్టులు ఇప్పటివరకు సేవలు అందించాయి. ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో ఆయా చెక్‌పోస్టులను తొలగించనున్నారు. మొదటి ఆరు నెలలు మొబైల్ స్క్వాడ్ సిబ్బంది చెక్‌పోస్టుల్లో విధులు నిర్వహిస్తారు. పన్ను చెల్లించని వాహనాలను రాష్ట్రంలోకి రాకుండా చూస్తారు. ఉమ్మ డి ఆదిలాబాద్ జిల్లాలోని మూడు చెక్‌పోస్టుల్లో మొ త్తం 21 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. భోరజ్ చెక్ పోస్టులో 10 మంది, భైంసా చెక్‌పోస్టులో ముగ్గురు. వాంకిడి చెక్‌పోస్టులో 8 మంది సిబ్బంది పని చేస్తున్నారు.

● వాహన్ సాఫ్ట్‌వేర్ ద్వారా ఆన్‌లైన్ సేవలు

రవాణాశాఖ పరంగా చెక్‌పోస్టుల్లో అందించే సేవలను ఇకపై వాహన్ సాఫ్ట్‌వేర్ ద్వారా స్వచ్ఛందంగా ప న్ను ఆన్‌లైన్ ద్వారా డ్రైవర్లు చెల్లించవచ్చు. తాత్కాలిక పర్మిట్, వలంటరీ ట్యాక్స్ స్పెషల్ పర్మిట్ సేవలను ప్రజలు ఇకపై ఆన్‌లైన్ ద్వారా పొందవచ్చు. వాహన్ సాఫ్ట్‌వేర్ ద్వారా పన్ను ఆన్‌లైన్‌లో చెల్లించేలా చెక్‌పోస్టు సిబ్బంది డ్రైవర్లకు అవగాహన కల్పించ నున్నారు.

● అక్రమ రవాణా పెరిగే అవకాశం

ప్రభుత్వం సరిహద్దులోకి రవాణాశాఖ చెక్‌పోస్టులను తొలగించడంవల్ల అక్రమ రవాణా పెరిగే అవకాశాలు ఉన్నాయి. చెక్‌పోస్టులు లేకపోవడంతో మద్యం, ఇసుక, పశువులు, ఇతర వస్తువుల అక్రమ రవాణా పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. చెక్‌పోస్టులు లేకపోవడంతో సరిహద్దులో పటిష్టమైన నిఘా లేని కారణంగా సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశాలు లేకపోలేదు. సరిహద్దులో తనిఖీలు లేకపోవడంతో సరైన పత్రాలు లేకుండా ప్రయాణించడం, ఓవర్‌లోడ్‌తో వెళ్లడం, అసాంఘిక శక్తులు సులభంగా సరిహద్దులు దాటే అవకాశం ఉంది. దీంతో పాటు చెక్‌పోస్టుల ద్వారా ప్రభుత్వానికి వచ్చే లక్షల రూపాయల ఆదాయానికి గండి పడనుంది.

భారీ వర్షం... స్తంభించిన రాకపోకలు


లో లెవల్ వంతెన పైనుంచి ప్రవహిస్తున్న కుశ్నపల్లి వాగు

బెజ్జూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం ఉదయం నుంచి భారీవర్షం కురవడంతో మండలంలోని లో లెవల్ వంతెనలపై నుంచి భారీగా వరద నీరు పారడంతో రాకపోకలు స్తంభించిపోయాయి. కుశ్నపల్లి, సోమిని గ్రామాల మధ్య రెండు లో లెవల్ వంతెనలపై నుంచి వరద నీరు పారుతుండడంతో వాగు అవతల ఉన్న గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. వాగుపై వంతెనలు లేకపోవడంతో ఎన్నో ఏళ్లుగా పలు గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. వాగు అవతల ఉన్న సుశ్మీర్, సోమిని, మొగవెల్లి, ఇప్పలగూడ, నాగెపల్లి, బండలగూడ, పాత సోమిని, గెర్రెగూడ తదితర గ్రామాలకు రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. ప్రతియేటా వర్షాకాలంలో వాగు ఉప్పొంగినప్పుడల్లా హైలెవల్ వంతెనలు ఏర్పాటు చేయని కారణంగా అవస్థలు తప్పడం లేదు. ముఖ్యంగా గర్భిణీలు ప్రసవం కోసం ఆసుపత్రికి వెళ్లే సమయంలో తీవ్రఅవస్థలు ఎదుర్కొంటున్నారు.

వట్టివాగు, కుమరంభీం ప్రాజెక్టు గేట్ల ఎత్తివేత

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆదివారం రాత్రి, సోమవారం కురిసిన భారీ వర్షానికి వట్టివాగు, కుమరంభీం ప్రాజెక్టుల్లోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. వట్టివాగు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 239.5 మీటర్లకు గాను ప్రస్తుతం 238.450 మీటర్లకు చేరుకుంది. ప్రాజెక్టులోకి 1,300 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుండటంతో రెండు గేట్లు ఎత్తి 1,083 క్యూసెక్కుల వరదనీరు బయటకు వదులుతున్నారు. కుమరంభీం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 243 మీటర్లకు గాను ప్రస్తుతం 237.40 మీటర్లకు చేరుకుంది. ప్రాజెక్టులోకి 6,600 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుండటంతో మూడు గేట్లు ఎత్తి 5,900 క్యూసెక్కుల వరద నీటిని బయటకు వదులుతున్నారు. గూడెన్‌ఘాట్, గుండి పెద్దవాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. పెద్దవాగు నది పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలి

రెబ్బెన, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాతంగా జరుపుకోవాలని సీఐ సంజయ్ కుమార్ తెలిపారు. సోమవారం కాగజ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వినాయక నిమజ్జనం సందర్భంగా డీజేలు పెట్టరాదని తెలిపారు. శాంతియుత వాతావరణంలో కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఎస్సై చంద్రశేఖర్, సిబ్బంది, గణేష్ మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

లింగాపూర్: గణేష్ నిమజ్జనాన్ని శాంతియుతంగా నిర్వహించుకోవాలని ఎస్ఐ గంగన్న సూచించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల్లో కొలువుదీరిన వినాయక విగ్రహాలను ఉత్సవ సమితి నిర్వహకులు వారివారి బాధ్యతల అనుసారంగా నిమజ్జనాన్ని శాంతియుతంగా నిర్వహించుకోవాలని అన్నారు.

డిజిటల్ లిటరసీపై అవగాహన కల్పించాలి

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో కృత్రిమ మేథా, సాంకేతిక నైపుణ్యం, డిజిటల్ లిటరసీ మీద అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్ సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలో మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేసిన పాఠశాలల నుంచి వచ్చిన గణిత, భౌతికశాస్త్రం ఉపాధ్యాయులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. గణితంలో కోడింగ్, డేటా సైన్స్, భౌతికశాస్త్రంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఫిజికల్ కంప్యూటింగ్ వంటి అంశాలు విద్యార్థులకు బోధించాలన్నారు. ఈ అంశాలపై మూడు రోజుల శిక్షణ ఉంటుందని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్పీలు రాకేష్, శ్రీనాథ్, శ్యాంసుందర్, సంతోష్, ప్రిన్సిపాల్ మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం

జైనూర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను బీజేపీ నాయకులు మండల కేంద్రంలో సోమవారం దహనం చేశారు. ప్రధాని మోదీ తల్లిపై రాహుల్‌గాంధీ అసభ్యకరంగా మాట్లాడటం తగదన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం, మండల అధ్యక్షుడు మేస్రాం జ్ఞానేశ్వర్, ఎస్టీ మోర్చా ప్రధాన కార్యదర్శి కోట్నాక విజయ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోవ విజయ్, జిల్లా కార్యదర్శి కేంద్రే సుబోధ్‌కాంత్ ఉన్నారు.

బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ నాయకుల సంబరాలు


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేయడంతో జిల్లా కేంద్రంలోని డీసీసీ కార్యాలయం ఆవరణలో టీపీసీసీ ఉపాధ్యక్షురాలు సుగుణక్క ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు సోమవారం సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సుగుణక్క మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ చట్టబద్ధంగా అమలు చేసే దిశగా కాంగ్రెస్ మొదటి నుంచీ ప్రయత్నం చేస్తోందన్నారు.

కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతికి పంపించి బిల్లును ఆపించిందని ఆరోపించారు. బీసీలపై బీజేపీకి ఉన్న ప్రేమ ఇక్కడే అర్థమవుతుందని ఎద్దేవా చేశారు. బీసీలపై కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి నుంచి చిత్తశుద్ధి ఉందని రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో మాట్లాడడం దీనిని నిదర్శణమన్నారు. కార్యక్రమంలో నాయకులు బాలేష్‌గౌడ్, విశ్వనాథ్, అనీల్‌గౌడ్, చరణ్, రమేష్, మునీర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీని విమర్శిస్తే పుట్టగతులుండవు..

జైనూర్: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ఓర్వలేక తమ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీపై బీజేపీ విమర్శలు చేస్తోందని తమ నేత దిష్టిబొమ్మను దహనం చేస్తే పుట్టగతులుండవని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణక్క హెచ్చరించారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పేదప్రజల కోసం అధికారులు విధులు నిర్వర్తిస్తుంటే కొందరు గిట్టనివారు అధికారులను బెదిరిస్తూ అభివృద్ధికి అడ్డంకిగా మారుతున్నారని, అలాంటి వారు ఎంతటి వారైనా సరే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు, సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్, మండల పార్టీ అధ్యక్షుడు అబ్దుల్ ముకీద్, ఉపాధ్యక్షులు పెందుర్ ప్రకాష్, మాజీ వైస్ ఎంపీపీలు షేక్ రషీద్, చిర్లే లక్ష్మణ్, మాజీ ఎంపీటీసీ రాథోడ్ రమేష్, మార్కెట్ డైరెక్టర్లు మడావి క్రిష్ణ, లింగు పాల్గొన్నారు.

మల్టీపర్పస్ కార్మికుల ధర్నా

జైనూర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రిలో రోగులకు అనేక విధాలుగా సేవలందిస్తున్నప్పటికీ తమకు ఐదు నెలల నుంచి వేతనాల చెల్లింపుల్లో జాప్యం చేస్తున్నారని నిరసిస్తూ ఆసుపత్రి ఎదుట మల్టీపర్పస్ వర్కర్లు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతు వర్కర్లకు ఉద్యోగ భద్రత లేక అనేక ఇబ్బం దులు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదు నెలల నుంచి వేతనాలు అందక కుటుంబపోషణ భారంగా తయారైందన్నారు. వేతనాలు చెల్లించకుంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకుడు సందీప్ కుమార్, వర్కర్లు పాల్గొన్నారు.

న్యాయవాది సతీష్‌బాబుకు సన్మానం

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జైనూరు మండల కేంద్రంలో జరిగిన ఆదివాసి మహిళపై అఘాయిత్యానికి పాల్పడ్డ మగ్దుమ్‌కు ఇటీవల స్పెషల్‌కోర్టు జీవితఖైదు విధించింది. ఇందుకు ఆదివాసీలు, రాయి సెంటర్ నాయకులు న్యాయవాది బోనగిరి సతీష్‌బాబును సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ ఆదివాసీలపై అక్రమంగా కేసులు నమోదు చేసి జైలుకు తరలించిన తర్వాత అరెస్టైయిన వారందిరికీ ఉచితంగా న్యాయసేవ అందిస్తూ వారందరిని బెయిల్‌పై విడిపించారన్నారు. కార్యక్రమంలో అదివాసి సంఘాల నాయకులు దేవేందర్, దుందేరావు, మోతిరాం, భీంరావు, అర్జున్, ఆత్రం భగవంత్‌రావు పాల్గొన్నారు.

పరిహారం అందజేస్తాం

లింగాపూర్, సెప్టెంబరు, 1 (ఆంధ్రజ్యోతి): గత నెల 25న చిరుత దాడిలో మేక మృతి చెందిన సంఘటన మండలంలోని కొత్తపల్లి అటవీ ప్రాంతంలో జరిగింది. విషయం తెలుసుకున్న జోడేఘాట్ రేంజ్ అధికారి జ్ఞానేశ్వర్, ఎఫ్ఎస్‌వో అనూష, బీట్ అధికారి మహేష్‌లు సోమవారం కొత్తపల్లిలో రైతు పవార్ రవిందర్‌ను కలిశారు. ఈ సందర్భంగా మేక మృతి చెందిన వివారాలను, దాని విలువను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం పరంగా పరిహారం అందజేస్తామని వారు రైతుకు హామీ ఇచ్చారు.

విన్నపాలు వినవలే..

పాఠశాలకు భవనం మంజూరు చేయండి

కెరమెరి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాబేఝరి గ్రామ పంచాయతీలోని పాట్నాగూడ(కోలాంగూడ) ప్రాథమిక పాఠశాల భవనాన్ని మంజూరు చేయాలని కోరుతూ సోమవారం కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా చైర్మన్ రాథోడ్ రమేష్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల లేదని గతంలో ఫిర్యాదు చేయగా సీఆర్టీని గిరిజన శాఖ ద్వారా నియమించినందుకు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే త్వరలోనే పాఠశాల పక్కా బవనం నిర్మించాలని కలెక్టర్‌కు విన్నవించారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ వీలైనంత త్వరగా ప్రత్యేక నిధులు మంజూరు చేసి భవనం నిర్మిస్తామని హామి ఇచ్చారు.

రోడ్లకు మరమ్మతులు చేయాలని..


కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

చింతలమానేపల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు దోని శ్రీశైలం కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా చింతలమానేపల్లి మండలం కోయపల్లి- గూడెం రోడ్డు, సిర్పూర్ నియోజకవర్గంలో కోతకు గురైన దాదాపు 12 రోడ్లను వెంటనే మరమ్మతులు చేయాలని కోరారు. కర్జెల్లి-గూడెం వరకు మంజూరైన రోడ్డును అటవీ అధికారులు అడ్డుకున్నందున డీఎఫ్‌వో, ఎఫ్‌డీవోలకు ఆదేశాలు ఇవ్వాలని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన కలెక్టర్ రోడ్లకు మరమ్మతులను చేపట్టేలా కృషి చేస్తానని అన్నారు. ఆయన వెంట నాయకుల సుధాకర్‌రావు, శంకర్ తదితరులు ఉన్నారు.

భవనాలు మంజూరు చేయాలని..

పెంచికలపేట, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పెంచికలపేట గ్రామ పంచాయతీ పరిధిలో నూతన అంగన్‌వాడీ, పంచాయతీ భవనాలు మంజూరు చేయాలని కోరుతూ గ్రామ యువకులు ఎంపీడీవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ విజయ్, కార్యదర్శి చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలుగా అంగన్‌వాడీ కేంద్రానికి పక్కాభవనం లేక వర్షాకాలం, వేసవికాలం పిల్లలకు పలు సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. గ్రామంలోని ప్రభుత్వ స్థలంలో శాశ్వత భవనం నిర్మాణం జరిగేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామ పంచాయతీ కార్యాలయం సైతం శిథిలావస్థకు చేరి ప్రమాదకంగా ఉందని కొత్త భవనం మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో యువకులు శేఖర్, సాయి, ఇస్తారి, కిశోర్, అరుణ్, మల్లేష్, శ్రావణ్ పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వోకు వినతి

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎన్‌సీడీ ప్రోగ్రాం, టీబీ నిక్‌చర్ పోర్టల్‌లో పోస్టల్‌లో స్క్రీనింగ్ టెస్ట్‌తో పాటు ఎఫ్‌లైన్, ఆన్‌లైన్ పనులను తొలగించాలని కోరుతూ సోమవారం ఎంపీహెచ్‌ఏ(ఎఫ్) సిబ్బంది డీఎంఅండ్‌హెచ్‌ఓ సీతారాంకు వినతి పత్రం అందజేశారు. రోజుకు పది నుంచి 12 గంటలు పని చేయాల్సి వస్తుందని, ఒక వైపు ఫీల్డ్ వర్క, మరో వైపు ఆన్‌లైన్ పనులు చేయలేక పోతున్నామన్నారు.

బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలి

- ఎస్పీ కాంతిలాల్ పాటిల్


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ కాంతిలాల్ పాటిల్

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ కాంతిలాల్ పాటిల్ జిల్లా పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణిలో భాగంగా ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలు నిర్భయంగా పోలీసు సేవల్ని వినియోగించుకుంటూ సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు.

జిల్లాలో 30 పోలీసు యాక్టు అమలు

ఆసిఫాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా ప్రశాంతా వాతావరణ పరిస్థితులను మరింత సవ్యంగా కొనసాగించడానికి సెప్టెంబరు 1 నుంచి 30 వరకు జిల్లా అంతటా 30 పోలీసు యాక్టు అమలులో ఉంటుందని ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 30 పోలీసు యాక్టు అమలులో ఉన్నందున ముందస్తు అనుమతులు లేకుండా ఎలాంటి ప్రజా సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, బహిరంగ సభలు నిర్వహించవద్దని సూచించారు. నిషేధిత ఆయుధాలు, దురుద్దేశంతో నేరాలకు ఉసి గొలిపే ఎటువంటి ఆయుధాలు కలిగి ఉండవద్దన్నారు. లౌడ్ స్పీకర్లు, డీజేలు వంటివి నిషేధమని ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

ఎస్పీకి సన్మానం

ఆసిఫాబాద్‌రూరల్/జైనూర్ సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): గత సంవత్సరం జైనూరు మండల పరిధిలో జరిగిన సంఘటనలో ఒక మహిళపై హత్యాచారయత్నం, హత్యాయత్నం చేసిన నిందితుడికి ఆదిలాబాద్ ఎస్సీ, ఎస్టీ కోర్టు జీవిత ఖైదు, రూ.30 వేల జరిమానా విధించడంతో సోమవారం జైనూర్ మండల వాసులు ఎస్పీ కాంతిలాల్ పాటిల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. తీర్పుతో సంతృప్తి వ్యక్తం చేస్తూ జిల్లా పోలీసు శాఖ చేసిన కృషి మరువలేదని, నేరానికి పాల్పడిన వారికి శిక్ష తప్పదనే నమ్మకం ఈ తీర్పుతో కలిగిందని వారు అన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేరం చేసిన వారిని ఎవరినీ చట్టం వదిలి పెట్టదని, ఎవరైనా ఎంతటి ప్రభావం ఉన్న ఉన్నవారైనా చట్టరీత్యా తప్పక శిక్షపడుతుందన్నారు. మహిళలపై జరిగే నేరాల విషయంలో పోలీసు శాఖ కఠిన వైఖరి వలంభిస్తోందని తెలిపారు. ఇలాంటి నేరస్తులు ఎవరు శిక్ష నుంచి తప్పించుకోలేరన్నారు. కార్యక్రమంలో నాయకులు దేవేందర్, మోతిరాం, ఆనందరావు, భగవంతరావు, ఆనందరావు, దుందేరావు, భీంరావు, శ్యాంరావు, అర్జున్ పాల్గొన్నారు.

పెన్షన్ భిక్ష కాదు.. ఉద్యోగి హక్కు

- కలెక్టరేట్ ఎదుట ఉద్యోగుల నిరసన



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పెన్షన్ ఉద్యోగులకు భిక్ష కాదని అది హక్కు అని ఉద్యోగ ఉపాధ్యాయుల సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ డిమాండ్ చేశారు. పెన్షన్ విద్రోహ దినాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపి కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ పదవీ విరమణ అనంతరం పెన్షన్ పొందడం ఉద్యోగి హక్కు, అది ప్రభుత్వ దయాధర్మమో, భిక్షనో కాదన్నారు. ప్రపంచ బ్యాంకు విధానాలను అమలు చేస్తూ ఉద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నారన్నారు. ధర్నాకు జిల్లా వైద్యాధికారి సీతారాం మద్దతు తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు శాంతికుమారి, ఉమర్ హుస్సేన్, ఊశన్న, హేమంత్, శ్రీనివాసరావు, తుకారాం, సదాశివ్, ఖమర్ హుస్సేన్, శ్రీపాద, వలిఖాన్, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జైనూర్: తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ పిలుపుమేరకు సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఉద్యోగులు నిరసన తెలిపారు. కార్యాలయం సిబ్బంది, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే


దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.

ఆసిఫాబాద్ మండలం బూర్గుడ గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన చిలారి శిల్పరాణి తనకు దివ్యాంగ పెన్షన్ మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు. ఆసిఫాబాద్ మండల కేంద్రానికి చెందిన వెంకటేష్ జన్కాపూర్ శివారులో తన భూమికి పట్టా పాసు పుస్తకం జారీచేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఆసిఫాబాద్ మండలం గోవిందాపూర్ గ్రామానికి చెందిన విలాస్, ఆసిఫాబాద్ మండలం జన్కాపూర్‌కు చెందిన సమీనా బేగం తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు. తిర్యాణి మండలం తలండి గ్రామానికి చెందిన రాజలింగు తన తండ్రి పేరిట గల భూమికి పట్టాపాసు పుస్తకం జారీ చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కెరమెరి మండలం బాబేఝరి గ్రామపంచాయతీ పాటగూడ పాఠశాల భవనం మంజూరు చేయాలని జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా చైర్మన్ రమేష్ కోరారు. వట్టివాగు ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువకు కొమ్ముగూడ వద్ద గండి పడడంతో నీరు వృథాగా పోతోందని మరమ్మతులు చేపట్టాలని రెబ్బెన పీఏసీఎస్ చైర్మన్ సంజీవ్ అర్జీ సమర్పించారు. కౌటాల మండలం కన్నెపల్లికి చెందిన పాండుమేరకు తన తండ్రిపేరిట గల భూమిని ఆయన మరణించినందున తన పేరిట విరాసత్ చేయాలని దరఖాస్తు అందజేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరిం చాలని, దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా చూడాలని అధికారులకు సూచించారు.